ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 29 డిసెంబరు 2024



జగన్ అవినీతితోనే ప్రజలపై విద్యుత్ భారం

- వైసీపీ ధర్నాలకు ప్రజల్లో, పార్టీలో స్పందన లేదు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతి వల్లే ప్రజలపై రూ.లక్ష 29 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2014 నుం చి 2019 వరకు కూడా ఒక్క రూపాయి కరెంటు చార్జీలు పెంచలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతవరకు విద్యుత్ చార్జీలను పెంచలేదని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాల కారణంగా ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెరిగాయని తెలిపారు. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉన్న రాష్ట్రాన్ని 2019 నాటికి మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా తీర్చిదిద్ది వైసీపీ ప్రభుత్వానికి నా టి టీడీపీ ప్రభుత్వం అప్పగించిందన్నారు. కానీ 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ప్రజలపై రూ.35 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపడమే కాకుండా రూ.1.20 లక్షల కోట్ల నష్టాన్ని విద్యుత్ శాఖలో తెచ్చిపెట్టారన్నారు. సాధారణంగా ఈఆర్సీకి పంపిన 90 రోజుల్లోపు ట్రూఅప్ చార్జీలు ఆమోదం పొందాలని, కానీ 2024 మే వరకు వాటిపి వాయిదా వేస్తూ వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈఆర్సీ నుంచి ఆమోదం పొందిన ట్రూఅప్ చార్జీలు నేడు ప్రజలపై భారంగా పడుతున్నాయని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో కనీసం ఒక్క మెగా వాట్ కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేదన్నారు. విద్యుత్ వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్ కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీలపై జగన్‌మోహన్‌రెడ్డి ధర్నాలకు పిలుపునివ్వడం మరో తుగ్లక్ చర్య అని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డిపై కార్యకర్తలే తిరగబడే పరిస్థితిని తెచ్చుకున్నారన్నారు. కాంట్రాక్టు పనులు చేయించి బిల్లులు ఎగ్గొట్టారన్నారు. తన ఐదేళ్ల పాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీలను, పలు మార్లు బస్సు చార్జీలను జగన్ పెంచారని గుర్తు చేశారు. ప్రభుత్వలో ఉనికి కోల్పోయిన వైసీపీ ధర్నాలు చేస్తోందని, వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ధర్నాలో పాల్గొనాలని జగన్ ఇచ్చిన పిలుపునకు ప్రజల్లోనే కాకుండా సొంత పార్టీలో కూడా స్పందన లేదని తెలిపారు.

'సదరం' స్లాట్ బుకింగ్‌కు తాత్కాలిక విరామం?

- వికలాంగుల పింఛన్ల పరిశీలన కారణంగా నిలుపుదల

కలికిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం స్థాయి నిర్ధారణ కోసం నిర్వహిస్తున్న సదరం సేవలకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. జనవరి నుంచి విడుదల కావలసిన స్లాట్ బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో మరో నాలుగు నెలలు సదరం సేవలు, అంగ వైకల్యానికి సంబంధించిన కొత్త సర్టిఫికెట్ల జారీకి అవకాశం ఉండదని, ఆరోగ్య శాఖకు చెందిన సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వికలాంగుల పింఛను లబ్ధిదారుల్లో అనేకమంది అనర్హులున్నట్లు ప్రభుత్వం దృష్టికి రావడంతో జిల్లాకు ఒక సచివాలయం వంతున ఎంపిక చేసి పైలెట్ ఆడిట్ నిర్వహించారు. ఈ పరిశీలనలో అనుమానించినట్లుగానే అనేక బోగస్ సర్టిఫికెట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. వీరందరికీ తిరిగి సాంకేతికపరమైన నిర్ధారణ కోసం వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతగా నూరు శాతం వైకల్యంతో నెలకు రూ.15 వేల వంతున పింఛను తీసుకుంటూ మంచానికి పరిమితమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ కేటగిరీలో 25 వేల మంది అనర్హులున్నట్లుగా గుర్తించినట్లు చెబుతున్నారు. అనంతరం విడతల వారీగా వివిధ రకాల అంగవైకల్యంతో పింఛన్లు పొందుతున్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మధ్యలో సదరం స్లాట్ బుకింగ్‌లతో మరో వైపు వైద్య పరీక్షలు నిర్వహించి సరిఫికెట్లు జారీ చేస్తే గందరగోళం ఏర్పడుతుందన్న కారణంగా తాత్కాలికంగా పింఛన్ల పరిశీలన పూర్తయ్యే వరకు సదరం సేవలను నిలుపుదల చేయనున్నట్లు చెబుతున్నారు. ఆగస్టులో విడుదలైన స్లాట్ బుకింగ్‌లు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే కన్ఫర్మ్‌డ్ స్లాట్‌లు పూర్తయిపోయాయి. కేవలం వెయిటింగ్ కేటగిరీలో రెండు, మూడు రకాల వైకల్యంకు సంబంధించిన స్లాట్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. డిసెంబరు నెలాఖరుకు చివరి విడత స్లాట్ బుకింగ్‌లు క్లోజ్ కానున్నాయి.

విద్యార్థుల ఆటో బోల్తా

8 మందికి గాయాలు

6

గుండె ఆగిపోతోంది..

- అధికమవుతున్న గుండెపోట్లు
- విద్యార్థుల నుంచి యుక్త వయస్సు వారికీ..
- పెరిగిపోతున్న హఠాన్మరణాలు
- ఆహార అలవాట్లు మారడం.. జంక్‌ఫుడ్ తీసుకోవడం...
- శారీరక శ్రమకు దూరమవుతున్న పర్యవసానం



6



రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవోను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ జాగీర్లు కాదని, అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ హెచ్చరించారు. 11 మంది ఎమ్మెల్యేలను మాత్రమే ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా.. వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదన్నారు. దాడుల సంస్కృతికి చరమగీతం పాడకపోతే ఇక్కడ మకాం వేస్తానని, అందరినీ సరిదిద్దాక ఇక్కడ నుంచి వెళతానని అన్నారు. అధికారం పోయినా వైసీపీ నాయకులకు మదం పోలేదన్నారు. ఏ అధికారిపై దాడి చేసినా తోలు ఒలుస్తామని పవన్‌కళ్యాణ్ హెచ్చరించారు.

- అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదు
- 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా.. వైసీపీకి బుద్ధి రాలేదు
- గతంలో పలువురిపై దాడులు చేసిన చరిత్ర సుదర్శన్‌రెడ్డిది
- రాయలసీమలో దాడుల సంస్కృతికి చరమగీతం పాడకపోతే..
- అన్నమయ్య జిల్లాలోనే మకాం వేస్తా
- డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్

ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ జాగీర్లు కాదు

కడప/రాయచోటి/గాలివీడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై శుక్రవారం మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆయన ప్రస్తుతం కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి ఘటన తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం, పీఆర్ అండ్ ఆర్డీ, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. తాను శనివారం కడపకు వెళ్లి బాధితుడిని పరామర్శిస్తానని అన్నారు. ఆ మేరకు ఆయన శనివారం మధ్యాహ్నం కడప విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న బాధిత ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించారు. దాదాపు 15నిమిషాల పాటు ఆసుపత్రిలో ఉండి ఎంపీడీవో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో జవహర్‌బాబు, భార్య అర్చన, కుమార్తె హాన్సి, కుమారుడు వినీత్‌లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రి ఎదుట మీడియాతో మాట్లాడారు. అనంతరం అన్నమయ్య జిల్లా గాలివీడుకు వెళ్లారు. ఘటన జరిగిన ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీపీ కుమారుడు జల్లా సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ చాంబర్ తాళాలు ఇవ్వాలని అడుగగా ఎంపీపీ పద్మాతమ్మ వస్తే ఇస్తానని, ఇతరులకు ఇవ్వలేమని ఎంపీడీవో సమాధానం ఇచ్చారన్నారు. దీంతో ఊగిపోయిన జల్లా సుదర్శన్‌రెడ్డి ఆయన అనుచరుడు వెంకటరెడ్డి మరో పదిహేను మంది అనుచరులతో ఎంపీడీవోను తన గదిలో నిర్బంధించారన్నారు. ఎంపీడీవో చాతీపై సుదర్శన్‌రెడ్డి తన్ని కింద పడవేసి పిడిగుద్దులతో, కుర్చీలతో అమానుషంగా దాడి చేశారన్నారు. అక్కడితో ఆగక అడ్డొచ్చిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా చితకబాదారన్నారు. వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తలుపులు బద్దలుకొట్టి ఎంపీడీవోను రక్షించారన్నారు. అంతటి దాడికి పాల్పడిన సుదర్శన్‌రెడ్డి, తన అనుచరులు దర్జాగా మరో గంట వరకు ఎంపీడీవో కార్యాలయంలో స్వైర విహారం చెయ్యడం వారి బరితెగింపునకు నిదర్శనమన్నారు. సత్వరం స్పందించిన ఎస్‌ఐ రామకృష్ణ, సీఐ కొండారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని దాడులకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు.

రైతు ఆత్మహత్య బాధాకరం

సింహాద్రిపురం మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం ఇక్కడ దిగగానే తెలిసిందన్నారు. ఆయన ఆత్మహత్య ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందో తెలియాల్సి ఉందని, దీనిపై పూర్తి విచారణ చేస్తున్నారన్నారు. ఇది చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారా లేక ఆత్మహత్య చేసుకునేలా చేశారా అనేది విచారణలో తెలుస్తుందన్నారు. విచారణ అనంతరం సరైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నామన్నారు.

ఆయనకు ఇలాంటి దాడులు కొత్తేమీ కాదు

వైసీపీ నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డికి ఇలాంటి దాడులు కొత్తమీ కాదని గతమంతా కూడా అతనిది నేరచరిత్రే అని డిప్యూటీ సీఎం అన్నారు. గతంలో గాలివీడు మండలంలో ఎంపీడీవోలుగా విధులు నిర్వహించిన ప్రతాప్, శ్రీనివాసులరెడ్డి, శేఖర్‌నాయక్‌పై కూడా అనేక మార్లు తన అనుచరులతో దాడులకు పాల్పడ్డారన్నారు. వైసీపీ ప్రజలు 11 మంది ఎమ్మెల్యేలను కట్టబెట్టి బుద్ధిచెప్పినా ఇంకా వారికి బుద్ధి రాలేదన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడులకు పాల్పడిన వారందరికీ ఊచలు లెక్కపెట్టిస్తామని హెచ్చరించారు. ఇలాంటి దాడులపై ఇప్పటికే ఎస్పీకి చట్టపరంగా నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించామన్నారు. అవసరమైతే డీజీపీతో చర్చించి కఠిన చర్యలు తీసుకునేలా ముందుకెళతామన్నారు.

భరోసా కల్పించేందుకే వచ్చా

ఇక్కడికి రావడానికి ప్రధాన కారణం.. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు తెగబడితే చర్యలు ఏ స్థాయిలో ఉంటాయో చెప్పడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామన్న భరోసా కల్పించేందుకే వచ్చామని పవన్‌కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో సహనంతో ఉన్నారని, అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో వైసీపీ నాయకులు అనవసరంగా రెచ్చగొట్టి కటకటాల పాలవ్వొద్దని సూచించారు. వైసీపీ నాయకులు పిచ్చి పిచ్చి వేషాలు వేసి అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తే అన్నమయ్య జిల్లాలోనే క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేసుకుని రౌడీమూకలను ఏరిపారేస్తానని హెచ్చరించారు. ఆధిపత్యపు దాడులు చేస్తే ఎదుర్కోండి మీకుఅండగా మేముంటామని



గాలివీడు ఎంపీడీవో కార్యాలయంలో సంఘటన వివరాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తెలుపుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఈ సందర్భంగా రాయలసీమ యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రజలు ధైర్యంగా మాట్లాడాలి

జవహర్‌బాబు భార్య భయపడుతున్నారని, మేము ఎస్సీ కులానికి చెందిన వారం మాకు భయమేస్తోందని అంటే భరోసా ఇచ్చామన్నారు. కలెక్టర్, ఎస్పీ ఉన్నారు, మేము ఉన్నామని భరోసా ఇచ్చామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం పని మాత్రమే కాదు.. ఓట్లేసి మా పని అయిపోయిందని అనుకోరాదని బయటకు వచ్చి ధైర్యంగా ఇలాంటి వాటిపై ప్రజలు మాట్లాడాలన్నారు. ఇలా దాడి చేసిన వారు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా భయపడాలన్నారు.

ఫ్యాన్స్‌పై పవన్‌కళ్యాణ్ అసహనం

కడప రిమ్స్ వద్ద విలేకరుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ మాట్లాడేటపుడు ఓజీ ఓజీ, సీఎం సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. దీంతో పవన్ కళ్యాణ్ ఏంటయ్యా మీరు ఎక్కడ ఏం చేయాలో తెలియదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ పెద్దత్తున ఆసుపత్రికి చేరుకున్నారు.

ఘనస్వాగతం

గాలివీడు పర్యటనకు వచ్చిన పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లాలోకి అడుగుపెట్టిన ఆయనకు.. దారిపొడవునా పల్లెల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పూలు చల్లి స్వాగతం పలికారు. రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుని.. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత.. 3.25 గంటలకు బయలుదేరారు. 4.23 గంటలకు గాలివీడుకు చేరుకున్నారు. 5.10గంటల వరకు ఇక్కడ ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన బయలుదేరి రాయచోటి మీదుగా కడపకు వెళ్లి అక్కడ నుంచి విమానం ద్వారా గన్నవరం వెళ్లారు. ఈ దారి పొడవునా పెద్ద సంఖ్యలో మహిళలు, యువత ఆయన కోసం ఎదురు చూశారు. గాలివీడు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి.. పూలు చల్లి.. సంబరాలు చేశారు. ఆయన వెంట కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, చామకూరి శ్రీధర్, ఉమ్మడి జిల్లాల ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, రిమ్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు 14 రోజుల రిమాండ్

గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన ముగ్గురు నిందితులకు లక్కిరెడ్డిపల్లె కోర్టు జడ్జి ఫైజున్నిసా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవోపై దాడి చేసిన కేసులో మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, నల్లబత్తిని వెంకటరెడ్డి, కుడుముల బయ్యారెడ్డిలను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారిని కడప సెంట్రల్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



రిమ్స్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్

పనికిరాని పట్టాలు..!

- ప్లాటు కేటాయించినా అందులోకి వెళ్లలేక..
- కోర్టుకు వెళ్లిన స్థలాల యజమానులు
- దిక్కుతోచని స్థితిలో జగనన్న లేవుట్ల లబ్ధిదారులు
- పట్టా ఉన్నా గృహయోగం లేకపోయే...
- 2 వేల మంది ఎదురుచూపు

ప్రత్యామ్నాయం చూపమన్నా పట్టించుకోలేదు..



కోళ్లబైలు సర్వే నంబర్-658-4లో ఇంటి పట్టా ఇచ్చారు. ఇక్కడ నిర్మాణం చేపట్టడానికి వెళితే ఆ స్థలం కోర్టులో ఉందని, ఇల్లు నిర్మించకూడదని చెప్పారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. వేరే చో ట స్థలం చూపిస్తే ఇల్లు కట్టుకుంటామని చాలాసార్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. అద్దె ఇంట్లో ఉంటు న్నాం. ఆలస్యం అయితే ఎన్నికలు వస్తాయ ని అప్పుడే చెప్పాం. అనుకున్నట్లే ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారింది. ఇప్పుడు పట్టాలు పనికి రాకుండాపోయాయి.

- కె.ప్రసన్నకుమారి, కురవంక

మదనపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం లో నమోదైన లబ్ధిదారులు చాలామంది బాధితులుగా ఉన్నారు. వీరికి పట్టాలు జారీ చేసి లేఅవుట్లలో ప్లాట్లు కేటాయించి, గృహనిర్మాణ పథకంలో ఇల్లు మంజూరైనా ఉపయోగం లేకుండాపోయింది. ఎందుకంటే మూడు లేఅవుట్లపై స్థానికంగా ఉన్న రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అక్కడ పట్టాల జారీ నుంచి నిర్మాణాల వరకూ ఆగిపోయాయి. ఇలా పట్టా లు జారీ చేయడమే కాదు..ఆ పట్టాలను లబ్ధిదారుల పేరున స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కూడా చేశారు. అనంతరం ఆ డాక్యుమెంట్లను అప్పట్లో వైసీపీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా సభలు, సమావేశాల్లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ క్రమంలో పదేళ్ల తర్వాత ఈ ప్లాటును అమ్ముకునే హక్కును కల్పిస్తూ అసైన్‌మెంట్ చట్టంలో సవరణ చేశారు. అంతవరకూ బాగానే ఉన్నా ఆదిలోనే హంసపాదు అన్నట్లు మొదట్లోనే పనులు ఆగిపోవడాన్ని బాధితులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలా పట్టాలు చేతికి తీసుకున్న వారు 2 వేల మందికిపైగా ఉండగా, వివిధ లేఅవుట్లలో ప్లాట్లు సిద్ధం చేసి పట్టాలు సిద్ధం చేసిన లబ్ధిదారులూ అంతకంటే ఎక్కువగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బాధితులుగా మారిన వారంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. కానీ ప్రస్తుతం అలాంటి వారికి అవకాశం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొన్ని లేఅవుట్లలో 200 మందికిపైగా నిర్మాణయోగ్యం కాని స్థలాల్లో పట్టాలు జారీ చేయడంతో వారు కూడా ఇంటి నిర్మాణాలకు దూరంగా ఉంటున్నారు.

మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డుల్లోని లబ్ధిదారులకు మండల పరిధిలోని కోళ్లబైలు, పొన్నేటిపాళెం, ఆరోగ్యవరం, పోతబోలు లేఅవుట్లలో పట్టాలు మంజూరు చేశారు. ఈ లేఅవుట్ల భూమి యజమానులు వివిధ కారణాలతో కోర్టుకు వెళ్లడంతో నిర్మాణాలకు బ్రేక్ పడింది. ఇందులో భాగంగా కోళ్లబైలు లేఅవుట్‌లో 700 మందికి, ఆరోగ్యవరం సమీపంలోని రెండు లేఅవుట్లలో 1300 మందికి ప్లాట్లు కేటాయించడంతో పాటు పట్టాలు కూడా లబ్ధిదారులకు ఇచ్చేశారు. ఈ క్రమంలో వీరిలో సగం మందికిపైగా వారి పేరున రిజిస్ట్రేషన్లు చేసి పత్రాలు జారీ చేశారు. మరికొందరి లబ్ధిదారుల నుంచి వీఆర్వోలు జారీ చేసిన పట్టాలు వెనక్కి తీసుకున్నారు. ఎందుకంటే పట్టా ఇచ్చి ప్లాటు చూపించలేదని, స్థలం ఇచ్చినా వివాదాలు ఉన్నాయని న్యాయ స్థానానికి వెళ్లే అవకాశం ఉండటంతో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇదిలావుండగా ఆరోగ్యవరం వద్ద రెండు లేఅవుట్లపై కూడా కోర్టు కేసులు నడుస్తున్నాయి. పరిష్కారం అయిందని అధికారులు చెబుతున్నా.. పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడికెళ్లి పనులు చేసే పరిస్థితి కనిపించలేదు. గతంలో ఉన్న ఆరోగ్యవరం డైరెక్టర్ కేసును వెనక్కి తీసుకున్నారని, తర్వాత వచ్చిన ఏఎంసీ డైరెక్టర్ తిరిగి కోర్టులో స్టేట్‌మెంట్ వేయడంతో కేసు మొదటికొచ్చిందని చెబుతున్నారు. ఇలా ఆరోగ్యవరం, కోళ్లబైలు, పొన్నేటిపాళెం, తదితర ప్రాంతాల్లోని లేఅవుట్లలో సమస్య ఏర్పడింది. గృహ నిర్మాణ లేఅవుట్లకు భూమిని తీసుకుంటున్న యజమానులను సంప్రదించకుండా, పాత డీకేటీ పట్టాలు ఉన్న వారికి నోటీసులు ఇవ్వకుండా, ఆ భూములను రద్దు చేయలేదు. దీంతో సమస్య ఉత్పన్నం కావడంతో లబ్ధిదారులకు జారీ చేసిన పట్టాలు పనికి రాకుండా పోయినట్లయింది. తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకుందామంటే అవకాశం లేకపోయింది. క్షేత్రస్థాయిలో భూమి చదునుతో పాటు నాటిన సరిహద్దు రాళ్ల, లేఅవుట్లలో రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన విద్యుత్తు లైట్లు నిరుపయోగంగా మారాయి. గతంలోని రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా కాగితాలలో లేఅవుట్లు గీచేసి పేదలకు పట్టాలు ఇచ్చేశారు. తర్వాత ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు క్షేత్రస్థాయిలోకి వెళుతుంటే రైతులు, భూమి యజమానులు అడ్డుకుంటున్నారు. లేఅవుట్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను తొలగించగా, అక్కడక్కడా లబ్ధిదారులు నిర్మించిన పునాదులు, ఇతర నిర్మాణాలను తీసేస్తున్నారు. కోర్టు కేసులతో పట్టాల జారీతో పాటు నిర్మాణాలకు బ్రేక్ పడింది. మరోవైపు వైసీపీ ప్రభుత్వం మొదట్లో అర్హతతో పనిలేకుండా అందరికీ పట్టాలు ఇచ్చేసింది. అప్పట్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఇంటి స్థలం కోసం దరఖాస్తులు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద ఇల్లు మంజూరు చేశారు. ఈ క్రమంలో వీరి అర్హతను ఆన్‌లైన్ (గత స్కీంలో ఉన్నారా? లేదా?)లో చెక్ చేయకుండా ఇబ్బడిముబ్బడిగా స్థలాలు, ఇల్లు ఇవ్వడంతో అసలు సమస్య తలెత్తిందని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారులు ఆలస్యంగా గుర్తించారు.

కోర్టు కేసులు, ప్రత్యామ్నాయ స్థలాలతో పాటు కొత్తగా ఎంపిక చేసిన లబ్ధిదారుల కోసం పోతబోలు, నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె సరిహద్దు (బసినికొండ)లో 275 ఎకరాలు కావాలని అధికారులు అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. భూపరిహారం కింద రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి రూ.31 కోట్లు అవసరమని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ అధికారులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. దీనిని దృష్టిలో పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ఆచితూచి అడుగులేస్తోంది. ఇందులో భాగంగా మొదటగా, సొంత స్థలాలు ఉన్నవారికే పీఎంఏవై పథకం కింద ఇల్లు మంజూరు చేస్తోంది. స్థలాలు లేనివారికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున..వివాద రహిత స్థలాల్లో పట్టాలు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తోంది.



ఆరోగ్యవరం సమీపంలోని లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లు



పోతబోలు పంచాయతీ కొత్తపల్లె వద్ద వేసిన లేఅవుట్



కోళ్లబైలులో లబ్ధిదారులకు కేటాయించిన వివాదాస్పద భూమి

కొత్త ప్రభుత్వంలో పట్టా వస్తుందో రాదో..



నవరత్నాల పథకంలో పట్టా మంజూరైంది. ఇల్లు కట్టుకుందామనిపోతే, అక్కడ సమస్య ఉంది.. స్థలం మరోచోట ఇస్తామన్నారు. కానీ ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇంటికి దరఖాస్తు చేసుకుందామంటే, రెండోసారి రాదని చెబుతున్నారు. బాడుగ ఇంట్లో ఉంటూ చేనేత మగ్గాలు వేసుకుని జీవిస్తున్నాం. కొత్త ప్రభుత్వంలోనైనా పట్టా మంజూరు చేస్తే ఇల్లు కట్టుకుంటాం.

- కె.సుకన్య, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె



చెన్నంశెట్టి విష్ణుస్వరూప్

ఇతని పేరు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఏకైక కుమారుడు. ఇతడి వయస్సు 40 సంవత్సరాలు. ఏమైందో ఏమోగాని శనివారం ఉదయం 11 గంటలకు గుండెపోటుతో హైదరాబాదులోని వారి స్వగృహంలో హఠాన్మరణం చెందారు. తన ఏకైక కుమారుడు విష్ణుస్వరూప్ హఠాన్మరణం చెందడంతో ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుటుంబం కుప్పకూలిపోయింది. అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నత స్థానాల్లో నిలబెట్టి తనవితీరా చూడాలనుకన్న ఆ తండ్రి, ఆ కుటుంబ ఆశలు అడియాశలయ్యాయి.



- ● అధికమవుతున్న గుండెపోట్లు
- ● విద్యార్థుల నుంచి యుక్త వయస్సు వారికి...
- ● పెరిగిపోతున్న హఠాన్మరణాలు
- ● ఆహార అలవాట్లు మారడం.. జంక్‌ఫుడ్ తీసుకోవడం
- ● శారీరక శ్రమకు దూరమవుతున్న పర్యవసానం



గుండె ఆగిపోతోంది..!

అధిక ఒత్తిడి వల్లే..



అధిక ఒత్తిడి వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మానవునికి దైనందిన జీవితంలో ఏదో ఒక దానిపై ఒత్తిడి పెరుగుతోంది. ఎప్పుడు ఒత్తిడి పెరుగుతుందో గుండెకు బరువు పెరుగుతుంది. గుండెపోట్లకు హఠాన్మరణం చెందడానికి ఫలాన కారణమి కచ్చితంగా చెప్పలమే. వ్యక్తుల శరీరాలు వారి జీవన విధానం, శరీర ఆకృతి, ఇత్యాది కారణాల వల్ల గుండెపోట్లు వస్తున్నాయి. వైద్యుల సలహాల మేరకు నడుచుకుని నిత్యం వ్యాయామం చేస్తూ తగు మోతాదులో ఆహారం తీసుకుంటూ ఉంటే ఏ గుండెజబ్బు రాదు.

- డాక్టర్ సానె శేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, రాజంపేట

శారీరక శ్రమ ఉండాలి...



నిత్యం వాకింగ్, వ్యాయా మం చేస్తే గుండెపోటు రాదు. ఎవరైనా పరిశీలించండి. నూటికి 90 శాతం మనిషికి వ్యాయామం, వాకింగ్, ధ్యాన ప్రక్రియ చేసిన వారికి గుండెపోటు రాదు. ఏవేవో కొవ్వు పదార్థాలు తింటూ ఇంటి వద్దనే ఉంటూ అధిక బరువుకు గురై దురలవాట్లకు లోనై అధిక ఊబకాయం ఉంటే గుండెపోటు ఎందుకు రాదు. మనిషి తన శరీరానకి నిత్యం పని కల్పించాలి. రక్త ప్రసరణ బాగా జరిగే రీతిలో పనులు చేసుకుంటూపోతే గుండెపోటు అసలే రాదు.

- డాక్టర్ సంగరాజు బాలరాజు, గుండె వైద్య నిపుణులు, రాజంపేట

రాజంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎందుకనో ఏమో... గత ఏడాదిగా గుండెపోట్లు పెరిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా వారానికి ఇద్దరో ముగ్గురో గుండెపోటుతో చనిపోతున్నారు. మామూలుగా అయితే శారీరక శ్రమ తక్కువగా ఉండి, ఎక్కువ ఒత్తిడి కలిగి ఉండి, భారీ కాయం కలిగి ఎటువంటి శ్రమ చేయకుండా ఇంటిపట్టునే ఉండి ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ అలవాట్లు ఉండి ప్రధానంగా షుగర్, బీపీ కలిగి ఉన్నవారు అందునా వయస్సు పైబడినవారు గుండెపోటుకు గురై మరణించినట్లు వింటుంటాం. అయితే ఇటీవల చిన్నారులు, 20 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువకులు, పెళ్లికాని వారు, యుక్త వయస్కులు ఎక్కువమంది చనిపోతున్నారు. శనివారం ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఏకైక కుమారుడు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్ (40) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. అదేవిధంగా రాజంపేటలో ప్రముఖ వాస్తు ప్లానర్ రజనీకాంత్ శనివారం ఉదయం బాత్‌రూంకు వెళ్లి అక్కడికక్కడే గుండెపోటుకు గురై మృతి చెందారు. గత ఏడాది ఓబులవారిపల్లె మండలం గురుకుల పాఠశాలలో 13 ఏళ్ల విద్యార్థి గుండెపోటుతో మరణించిన సంఘటన అందరినీ కలచి వేసింది. వికారాబాద్ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మేఘన అనే విద్యార్థిని రెండు రోజుల కిందట సహ విద్యార్థులతో ఆడుకుంటూ కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందడంతో రాజంపేటకు చెందిన మేఘన సహచర విద్యార్థులు తల్లడిల్లిపోయారు. ఇటీవల మూడు నెలలుగా పరిశీలిస్తే నెల రోజుల కిందట రాజంపేటలో నిత్యం యోగాభ్యాసం చేస్తూ అందరికీ యోగ, ధ్యానం నేర్పుతూ యోగా గురువుగా గుర్తింపు పొందిన టి.రెడ్డయ్య (50) రాజంపేటలో గుండెపోటుతో మృతిచెందారు. యోగ, ధ్యానం నేర్పే గురువుకే హఠాత్తుగా గుండెపోటు రావడం, అతను మరణించడం కలచివేసింది. తదనంతరం వారం రోజులకే జిల్లాలో ప్రముఖ ఏఐటీయూసీ నాయకుడు, ఉద్యమ నేత ఎంఎస్ రాయుడు చనిపోయే గంట ముందు వరకు ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఇంటికి వచ్చి అకస్మాత్తుగా గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. నందలూరు మండలంలో పెయింటర్‌గా పనిచేసుకుంటూ జీవించే 25 ఏళ్లు కూడా నిండని పెళ్లి కాని శ్రీనివాసులు గుండెపోటుతో మరణించాడు. ఇదే నందలూరులో ఇటీవల ఓ రోజు ఉదయం 7 గంటలకు పేపరు చదువుకుంటూ జయరామిరెడ్డి అనే వ్యక్తి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతానికి చెందిన బి.రామరాజు అనే ఎలక్ట్రీషియన్ హఠాన్మరణం చెందారు. పెనగలూరులోని పాత సింగనమల గ్రామానికి చెందిన కాలి లక్ష్మీనారాయణ అనే 22 ఏళ్ల యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు పంచాయతీలో 50 ఏళ్ల లోపు ఒక మహిళ, అదే ప్రాంతంలో 37 ఏళ్ల ఓ యువకుడు, మంగంపేటలో మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. రాజంపేట నలంద కళాశాల పక్కనే నివాసముంటున్న పి.వెంకటయ్య స్నేహితుడితో మాట్లాడుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇటీవల అతనికి రెండు స్టంట్లు కూడా వేశారు. అయినా ఎందుకనో మృతి చెందారు.

చిట్వేలిలో ఇటీవల విశ్వేశ్వరగౌడ్ అనే 50 ఏళ్ల మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. విశేశ్వరగౌడ్ నిత్యం వాకింగ్ చేస్తూ వ్యాయాయం చేస్తూ సన్నగా ఉన్నా గుండెపోటుతో మృతి చెందాడు. పుల్లంపేటలో కువైట్ నుంచి వచ్చిన 55 ఏళ్ల వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య ఉదయం ఈశ్వరాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మరో నాలుగు చోట్ల వ్యక్తిగత పనులు చూసుకుని పొలం వద్దకు వెళ్లి పొలంలోనే గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఒంటిమిట్ట మండలం పెద్ద కొత్తపల్లె గ్రామానికి చెందిన 56 సంవత్సరాల చెంగయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే గుండెపోటుతో మరణించారు. ఈ విధంగా చెప్పుకొంటూపోతే ఊరికొకరు, వీధికొక్కరు అన్న చందంగా గుండెపోటుతో మరణిస్తున్నారు. మృతులు వందలాది మందికి చేరుతున్నారు. ప్రస్తుత వర్షాకాల, శీతాకాల సమయంలో చలి ఎక్కువగా ఉండడం శ్వాసక్రియ నెమ్మది అయి ఊపిరితిత్తుల్లో నీరు చేరి చనిపోతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఒక్కో మండలాన్ని పారదర్శకంగా తీసుకుంటే గత నెలల్లోనే గుండెపోటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య 20 మందికి తగ్గడం లేదు. అందునా విద్యార్థులు, యువకులు, పెళ్లికాని వయస్కులు, నడి వయస్సు వారు ఎక్కువగా చనిపోవడం కలత కలిగించే అంశం. కుటుంబ భారాన్ని మోసేవారు చనిపోవడం వల్ల ఆయా కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి.

రాజంపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గుండెపోటుతో మృతి చెందిన వారు...



లక్ష్మీనారాయణ (పెనగలూరు), శ్రీనివాసులు (నందలూరు), బ్రహ్మయ్య (తాళ్లపాక), గంగయ్య (పెద్దకొత్తపల్లె), చిన్నబ్బిశెట్టి (పుల్లంపేట), రజనీకాంత్ రాజంపేట)

జీవనశైలిలో మార్పుతోనే...

మానవుడి జీవనశైలి మారడం వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మన పూర్వీకులు తెల్లవారు జాము నుంచే పంట పొలాలకు వెళ్లి పని చేసుకునేవారు. సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు పండించుకుని పోషక పదార్థాలను తినేవారు. ఎక్కువగా శారీరక శ్రమ కలిగి ఉండేవారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు కనీసం ఐదు మీటర్లు వెళ్లి క్రీడా మైదానంలో బాగా ఆడుకుని ఇంటికి వచ్చేవారు. ఇప్పుడంతా మారిపోయింది. నేటి హైటెక్ యుగంలో మానవ జీవనశైలే మారిపోయింది. పనిచేసేవారే లేకుండా పోయారు. కొవ్వు పదార్థాలు తిని సెల్ చూసుకుంటూ పనీపాటా లేకుండా ఉంటే గుండెపోట్లు రాకుండా ఎలా ఉంటాయి.



- లావులూరి శ్రీనివాసులు, జిల్లా మలేరియా మాజీ అధికారి, రాజంపేట.



- ● మన చిన్నతనంలో ఉన్నట్టు పాఠశాలకు నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడం, పాఠశాలల్లో క్రీడా మైదానాలే లేకపోవడం, చిన్నతనంలో అసలే వ్యాయామం లేకపోవడం వల్ల విద్యార్థి దశలోనే గుండెపోట్లు వస్తున్నాయి.
- ● ఎక్కువగా యువకులు, చిన్నారులు జంక్‌ఫుడ్ తీసుకోవడం, ఆహార నియమాల్లో ఎంతో తేడా రావటం, రసాయన ఎరువులతో పండే ఆహారాన్ని తినడం మరో ప్రధాన కారణంగా చూపుతున్నారు.
- ● బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నవారు వ్యాయామం చేయకపోవడం, ఆహార నియమాలను పాటించకపోవడం, కొవ్వు పదార్థాలు ఉన్న మటన్ లాంటి ఆహారం తీసుకోవడం వల్ల కూడా గుండెపోట్లు వస్తున్నాయంటున్నారు. ఎక్కువగా ఈ మధ్య ధూమపానం, మద్యపానానికి అలవాటు పడడం, ఈ గుండెపోట్లకు ప్రధాన కారణం అంటున్నారు.
- ● శారీరక శ్రమ లేకుండా, వ్యాయామం చేయకుండా ఎక్కువ కొవ్వు పదార్థాలు తింటూ ఉండడం గుండెపోటుకు ప్రధాన కారణం. వృత్తిపరమైన ఒత్తిడి కలిగి ఉండడం అధికంగా ఆలోచించడం, అధిక బరువు కలిగి ఉండడం కూడా ప్రధాన కారణమని చెబుతున్నారు.
- ● ప్రధానంగా ఒత్తిడి ఎక్కువగా ఉండడం, నిద్రలేనితనం, రక్తం గడ్డకట్టడం లాంటి కారణాలు ప్రధానం.



అయ్యో.. పాపం చిన్నారులు...

● ఉరి వేసుకుని తండ్రి ఆత్మహత్య



శ్రీనివాసులు మృతదేహం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యో పాపం ఆ చిన్నారులు.. తండ్రి చనిపోయాడని వారికి తెలియదు. తల్లి భోరున విలపిస్తుండటం చూసి వారు కూడా ఏడుస్తుండటం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఇద్దరు చిన్నారులను అనాథలను చేసి వెళ్లిపోయాడే అంటూ ఆ తల్లి రోదనలను చూసి ఆ చిన్నారులు ఏమి జరిగిందో తెలియక దిక్కుతోచని స్థితిలో వారు కూడా ఏడుస్తూనే ఉన్నారు. ఈ ఘటన శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె గజ్జలకుంట వద్ద మదర్‌మీరా స్కూల్‌లో ఓ గదిలో కాపురం ఉన్న శ్రీనివాసులు (32) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను చూసిన స్కూల్ పిల్లలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగానే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు... మృతుడు శ్రీనివాసులు తంబళ్లపల్లె మండలం, మూలపల్లె నుంచి పదేళ్ల క్రితం మదనపల్లెకు బతుకుదెరువు కోసం వచ్చాడని, 5 ఏళ్ల క్రితం మదనపల్లెకు చెందిన విజయలక్ష్మీతో వివాహం చేసుకున్నాడు. మదర్ మీరా స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవలే మానివేసి చిప్పిలి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో వంటమనిషిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్కూల్‌లో పనిచేస్తున్న సమయంలో కాపురం ఉండేందుకు గది ఇచ్చారని చెప్పారు. ఇతను మద్యం తాగి భార్యను కొట్టేవాడని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో నాలుగురోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఆతనికి భార్యతోపాటు దేవాన్ష్ (4) కుమారుడు, దేవాన్షి(3) కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న చిన్నారులు



సూర్యుడే.. గజగజ...

లోకానికి వెలుగులు నింపే సూరీడు మంచు గుప్పిట్లో చిక్కుకున్నాడు. శనివారం ఉదయం ములకలచెరువులో దట్టమైన పొగమంచు అలుముకుని తీక్షణ కిరణాల భానుడు కూడా చిన బోయి ముఖం చాటేశాడు. ఉదయం 9 గంటలైనా ఎండ జాడ కన్పించలేదు. అలాగే మంచు దుప్పటితో జాతీయ రహదారి కన్పించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- ములకలచెరువు (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం



మహాసభల ప్రచార యాత్రలో యూటీఎఫ్ నాయకులు

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు నిరంతరం పోరాటం అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార యాత్రల్లో భాగంగా శనివారం రాయచోటిలో ప్రచారయాత్రను ప్రారంభించారు. ఈ జాత రాయచోటి నుంచి బయలుదేరి గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, వాయల్పాడు మీదుగా పీలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలు ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా జరుగుతున్నాయని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ మహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు ప్రవేశ పెట్టి విస్తృతంగా చర్చలు జరిపి వాటి సాధన కోసం ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. జనవరి 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు పాల్గొంటారని, అలాగే వివిధ రాష్ట్రాల విద్యాశాఖ ప్రముఖులు, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావుద్దీన్, ఆదినారాయణ, పురం వెంకట్రమణ, అక్రమ్‌బాషా, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్రారెడ్డి, ప్రచురణల విభాగం కన్వీనర్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి



కురబలకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన చక్రిమ్మ (90) బతుకుదెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం మండలంలోని అంగళ్లుకు వచ్చి స్థిరపడింది. కాగా ఆమె సంతలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. ఆరోగ్యం ఆమెకు సహకరించకపోవడంతో కూరగాయలు అమ్మడం మానేసి, భిక్షాటన చేస్తుంది. కాగా మండలంలోని అంగళ్లు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలిని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దూడకు నీరు తాపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ చోటకుంటపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన పెద్దరెడ్డెప్ప భార్య చెంచమ్మ (70) తమ ఆవు దూడలను మేపేందుకు తరచూ గ్రామ శివారు ప్రాంతాలకు వెళుతుంది. యధా ప్రకారం శనివారం మేపేందుకు తోలుకెళ్లింది. నీరు తాపేందుకు స్థానికంగా ఉన్న బల్లెనిచెరువు వద్దకెళ్లి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. గ్రామస్థులు గమనించి బయటికి తీసేసరికే మృత్యువాతపడింది. ఈ మేరకు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హౌస్ ఆఫీసర్ రెడ్డెప్పనాయక్ తెలిపారు.

26 సిలిండర్లు స్వాధీనం



అక్రమంగా వాడుతున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో వాణిజ్య అవసరాల కోసం గృహోపకరణ సిలిండర్లను వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. శనివారం సివిల్ సప్లైస్ డీటీ వెంకటరెడ్డి, తహసీల్దార్ మహమ్మద్‌అన్సారీ తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని హోటళ్లు, టీకొట్లు, చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 దుకాణాలలో నిబంధనలను అతిక్రమించి వినియోగిస్తున్న 26 వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డీటీ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిలిండర్లు అక్రమంగా వినియోగిస్తున్న 16 మందిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కాగా గ్యాస్ సిలిండర్ల వినియోగంపై దాడులు నిర్వహిస్తారన్న సంగతి ముందస్తుగా కొందరు హోటల్ యజమానులకు తెలియడంతో వారు సిలిండర్లు దొరకకుండా జాగ్రత్తపడ్డారని, తెలియని వారు దొరికారని పట్టణంలో ప్రచారం జరిగింది. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీరాములు, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటో బోల్తా

● 8 మందికి గాయాలు

తంబళ్లపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇళ్లకు వెళుతున్న విద్యార్థుల ఆటో బోల్తా పడటంతో 8 మంది విద్యార్థులు గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో శనివారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె, దిగువపల్లె, గుండ్లపల్లెకు చెందిన పలువురు విద్యార్థులు తంబళ్లపల్లె మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులకు పాఠశాల తెరిచే సమయానికి అనువుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ పాఠశాలకు గుండ్లపల్లె రెడ్డిశేఖర్ నాయుడుకు చెందిన ఆటోలో వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల ముగియగానే సుమారు 15 మందికి పైగా విద్యార్థులు ఆటోలో వారి ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో పరుసతోపు సమీపంలో విద్యార్థులు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యాశ్విత (13), లాస్య (12) లిఖిత్ (14), అనిల్‌కుమార్‌రెడ్డి (14), పూర్ణిమ (11), మహమ్మద్ నవీద్ (14), హర్షిత (11), ఇంటర్మీడియట్ చదువుతున్న మౌనిక (17) గాయపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు గాయపడిన విద్యార్థులను హుటాహుటిన తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లిఖిత్, మహమ్మద్ నవాద్‌కు మోకాళ్లు, కాళ్లకు ఎక్కువగా గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిందన్న విషయం తెలుసుకున్న వారి తల్లితండ్రులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని గాయపడిన బిడ్డలను చూసి రోదించారు. కాగా మద్యం తాగి ఆటో నడపటంతోనే ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎంఈవో త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బస్సు ఏర్పాటు చేయాలి

తంబళ్లపల్లె-ములకలచెరువు రహదారిలో విద్యార్థుల పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ మార్గంలో ఉన్న బస్సు ఉదయం 9 గంటలకు పైగా వస్తుందని ఈ బస్సు తంబళ్లపల్లెకు చేరుకునే సరికి పాఠశాల ప్రారంభ సమయం దాటిపోతుందన్నారు. దీంతో ప్రతిరోజూ విద్యార్థులను ఆటోలో పాఠశాలలకు పంపిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు, పరామర్శిస్తున్న ఎంఈవో, తదితరులు

ప్రసవానికి వచ్చి మహిళ మృతి

● డాక్టర్ల నిర్లక్ష్యమే కారణం : కుటుంబ సభ్యులు


సుమతి మృతదేహంపై పడి రోదిస్తున్న బంధువులు - (ఇన్‌సెట్‌లో) మృతురాలి ఫైల్ ఫొటో

జమ్మలమడుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసవవేదనతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సుమతి (28) డాక్టర్ల నిర్లక్ష్యంతో మృతిచెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం వాసి సుమతి రెండవ కాన్పు నిమిత్తం ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు చేరింది. అయితే శనివారం ఉదయం డాక్టర్ విజయలక్ష్మి ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు వివరించారు. కాగా సుమతి మధ్యాహ్నం 1.30 గంటలకు మృతిచెందింది. ఈ విషయమై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా 'ఆంధ్రజ్యోతి'కి వివరణ ఇస్తూ ఆపరేషన్ అనంతరం ఆమెకు ఫిట్స్ రావడంతో మరణించిందని తెలిపారు. జమ్మలమడుగు అర్బన్ ఎస్‌ఐ రామక్రిష్ణ ఆస్పత్రికి వెళ్లి విచారించారు. ఏది ఏమైనా ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలింత సుమతి మృతిచెందిందని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉభయ రాష్ట్రాల వైస్‌చైర్మన్ కుంటుమల్ల రామమోహన్, నియోజకవర్గ మహిళా చైర్మన్ అన్నపురెడ్డి రాణి డాక్టర్లతో మాట్లాడారు.

కోనేట్లో పడి మహిళ మృతి


వెంకటసుబ్బమ్మ మృతదేహం

పెద్దముడియం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపసుపుల పొలాల్లో ప్రమాదవశాత్తు కాలుజారి కోనేట్లో పడి డి.వెంకటసుబ్బమ్మ (49) మృతి చెందింది. మృతురాలి కుమారుడు నారాయణరెడ్డి ఫిర్యాదుపై పెద్దముడియం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. వెంకట సుబ్బమ్మ గేదెలకు గడ్డి నిమిత్తం పంట పొలాలకు వెళ్లింది. అక్కడ ఉన్న కోనేటి వద్ద గడ్డి ఏపుగా పెరిగి ఉండడంతో కోనేటి కట్టపై ఉన్న గడ్డి కోస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కోనేటి నీటిలో పడింది. అయితే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆమెను ఎవరూ కాపాడలేని పరిస్థితి. ఎంతసేపటికీ వెంకటసుబ్బమ్మ ఇంటికి రాకపోవడంతో బంధువులు పొలాల్లోకి వెళ్లి వెదికారు. ఎక్కడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి కోనేటి వద్దకు వెళ్లి చూడగా వెంకటసుబ్బమ్మ మృతదేహం కనిపించింది. వెంటనే మృతదేహాన్ని బయటికి తీసి పెద్దముడియం పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి పంచనామా నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు

ఆర్ట్స్ బ్లాక్ ఆకస్మిక తనిఖీల్లో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి హెచ్చరించారు. రికార్డులు పక్కాగా ఉండాలని శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ బ్లాక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంగ్లీష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, హిస్టరీ, ఉర్దూ తెలుగు శాఖల రికార్డులను పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించకూడదని, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపని కాంట్రాక్ట్ సిబ్బందిని మందలించారు.

బీసీల అభివృద్ధికి సహకరించండి

ఈడీని కలిసిన బీసీ నేతలు


ఈడీతో సమావేశమైన బీసీ నేతలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల పేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ రుణాలను మంజూరు చేస్తోందని వాటిని సకాలంలో అర్హులకు అందించి వారి అభివృద్ధికి సహకరించాలని బీసీ సంఘాల నేతలు శనివారం బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయసింహను కోరారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎటువంటి రుణాలు ఇవ్వకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందనే అంశాన్ని ఈడీ దృష్టికి తీసుకువచ్చారు. సుమారు పది రకాల రుణాలకు ప్రతిపాదనలు పంపించామని అవి మంజూరు కాగానే అర్హులకు అందించే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, రజక సంఘం నేతలు గోవిందాయపల్లె కృష్ణయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నేతలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు

కీళ్ల మార్పిడి సదస్సులో డాక్టర్ జహంగీర్ బాషా



డాక్టర్ జహంగీర్ బాషాను మెమెంటోతో సత్కరిస్తున్న రోబోకాన్ ప్రతినిధి

కడప, ఎర్రముక్కపల్లి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జహంగీర్ బాషా పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన రోబో కాన్ 2.0 రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటువంటి గౌరవం దొరకడం రాయలసీమలోనే చాలా అరుదని చెప్పారు. దేశం నలుమూలల నుంచి రోబోటిక్ కీళ్ల రీప్లేస్‌మెంట్ సర్జన్‌లు పాల్గొన్నారని అందులో తన అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో కీళ్ళ మార్పిడి రోబోటిక్ అసిస్టెంట్ పద్ధతిలో జరుగుతాయని వివరించారు. జేబీ హాస్పిటల్లో ఉన్న వెలీస్ రోబో చాలా అత్యాధునిక మైనదని (ఫిఫ్త్ జనరేషన్) ఇంతకు మునుపు ఇతర రోబోల్లో ఉన్న సమస్యలు ఇందులో లేవన్నారు. ప్రస్తుతం ఆపరేషన్లు అతి తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో అతి తక్కువ రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్ లేకుండా జరుగుతాయన్నారు. ఇప్పటికే వందకుపైగా కీళ్ళ మార్పిడిలు చేసినట్లు వివరించారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు ఇప్పుడు రోబోటిక్ కీళ్ళ మార్పిడి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లవలసిన అవసరం లేదని జేబీ హాస్పిటల్‌లో అవకాశం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కలికిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు పొట్టేకులవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాణెమ్మ (60) మృతి చెందింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అండేకురవపల్లె దళితవాడకు చెందిన జంగం వెంకట్రమణ భార్య రాణెమ్మ పాలు కొనుక్కు. రావడానికి వెళుతుండగా కలికిరి నుంచి గుట్టపాలెం ఆచార్లగొల్లపల్లెకు వస్తున్న పవన్ కళ్యాణ్ ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాణెమ్మను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా మృతి చెందింది. మృతురాలి కుమారుడు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాడి ఆవు తోకను కత్తిరించిన దుండగులు

నిమ్మనపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాపం పుణ్యం ఎరుగని పాడి ఆవుపై కొందరు దుండగులు అమానుషంగా ప్రవర్తిస్తూ దాని తోకను కత్తిరించారు. రాచవేటివారిపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన నల్లప్పగారి పెద్దవెంకటమణ పాడి ఆవును తన రేకులషెడ్‌లో కట్టేసి ఉండగా శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు తోకను కోసివేశారు. దీంతో యజమాని పెద్దవెంకటరమణ ఉదయం ఆవును రెడ్డివారిపల్లిలోని పశువుల ఆస్పత్రిలో చికిత్స చేయించి అనంతరం కత్తిరించిన తోకను ఎత్తుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి ఆవుకు 3నెలల దూడ కూడా వుందని పాపం పుణ్యం ఎరుగని ఆవుపై అమానుషంగా తోకను కత్తిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు.

లింగమూర్తి జీవితం ప్రజలకే అంకితం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ హోం మంత్రి మైసూరారెడ్డి, రాజకీయ విశ్లేషకుడు లక్ష్మీనారాయణ


వామపక్ష పార్టీ నేతలు, లింగమూర్తి అభిమానులు, కుటుంబ సభ్యులు హాజరైన సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, చిత్రంలో ఎంవీ మైసూరారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేకుండా జన్మించారు, తన ప్రమేయం లేకుండానే మరణించారు, తన ప్రమేయం ఉన్న జీవితమంతా ప్రజలతోనే గడిపారని, వారి కోసమే జీవించారని, లింగమూర్తి జీవితమంతా ప్రజలకే అంకితం చేశారని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ రాజకీయ నేత, మాజీ హోం మంత్రి ఎం.వీ.మైసూరారెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. శనివారం ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విశ్వనాథపురం హిందూ శ్మశాన వాటికలో లింగమూర్తి స్మారక స్తూపాన్ని ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ లింగమూర్తితో ఐదు శతాబ్దాల అనుబంధం ఉందని, మొదటి తరం కమ్యూనిస్టు ఉద్యమనేతలు మొదలు నేటి తరం కార్యకర్తల వరకు ఆయన నిత్య యువకుడిలా రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రాయలసీమలోని కృష్ణాజలాలు నీటిపారుదల కోసం పోరుయాత్ర నిర్వహించారన్నారు. కోరుకున్న రంగంలో ఉద్యోగం సంపాదించుకునే వారైనా, ఏవీ కాదని


స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, జిల్లా నేతలు

ప్రజా సమస్యలే తన సమస్యగా భావించి ఎర్రజెండా చేతపట్టారని, ఏనాడూ పదవులను ఆశించలేదని, పార్టీ కార్యాలయాన్నే ఇళ్లుగా కార్యకర్తలకు అండగా 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేవారని వివరించారు. 1975 - 77లో జిల్లాలోని ప్రాజెక్టుల కోసం పర్యటనలు నిర్వహించారన్నారు. జిల్లా సమగ్ర సమాచార చరిత్ర, అరుణోదయ స్మృతులు అనే రెండు పుస్తకాలను రచించారని, వాటి ద్వారా పూర్తి సమాచారం జిల్లా ప్రజలకు తెలియపరిచారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో ఉన్నా ప్రాంతీయ అభిమానంతో ప్రాంతీయ నేతలను బలపరిచే వారని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందించే వారన్నారు. ఉద్యమాలతో పాటు కళారంగాలను బలపరిచే వారని, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడానికి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులుగా రాష్ట్ర నలుమూలలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని, వాటిని స్మరించుకుని నండూరి వెంకటేశ్వరరావు రాసిన పుస్తకంలో సాంస్కృతిక రంగంలో లింగమూర్తి పాత్ర అనే అంశాన్ని పొందుపరిచారని గుర్తుచేశారు. దేశంలో ప్రస్తుత రోజుల్లో విలువలు కోల్పోతున్నాయని పార్లమెంటులోనే అంబేద్కర్, గాంధీ, నెహ్రూలను అవమానించినా భారత ప్రధాని నోరు మెదపడం లేదని, పైగా వారికే మద్దతు ఇవ్వడం ఈ దేశం ఎటు పోతోందని వారు ఆశ్చర్యానికి లోనయ్యారు. బీజేపీ కోరుకున్నట్లు 400సీట్లు వచ్చి ఉంటే ఈపాటికి రాజ్యాంగాన్ని ఎప్పుడో మార్చేసే వారని, రాజ్యాంగం అన్నా ప్రజాస్వామ్యం అన్నా వారికి గౌరవం లేదన్నారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, లెక్కల జోగిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సిద్దిరామయ్య, మక్బూల్ బాష, వెంకటశివ, తస్లీమ్, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, ఆర్‌సీపీ, సీపీఐ, సీపీఎం, కార్యకర్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిటిష్ కాలం గ్రామాలు మాయం

పేర్లున్నాయి... మూడు గ్రామాలు లేవు ● 70 ఏళ్లుగా అలాగే పాలన


పెద్దగురవలూరు సదస్సులో పాల్గొన్న అధికారులు

చాపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్‌వారు 1905-1910 మధ్య ఏర్పాటు చేసిన గ్రామాలు మాయమయ్యాయి. పేర్లున్నా గ్రామాలు లేవు. అంతేకాదు సుమారు 70 ఏళ్లగా అలాగే పాలన సాగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ మూడు రెవెన్యూ గ్రామాల షెడ్యూల్ చూపుతున్నారు. లేని గ్రామాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో చూపుతుండడం వింతగా అనిపిస్తోంది. హైటెక్ యుగంలోనూ గ్రామాలు లేకుండా పరిపాలన చేయడం వింతగా అనిపిస్తోంది. రెవెన్యూ అధికారులు అనేక ఏళ్లగా ఈ గ్రామాలపై దృష్టి పెట్టలేదు. వివరాల్లోకెళితే...

మండలంలో 19 రెవెన్యూ గ్రామాలను బ్రిటిష్‌వారు ఏర్పాటు చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం భూములను రైతుల పట్టాల పేర్లతో ఆర్‌ఎస్‌ఆర్, ఎఫ్ఎంబీ (ఫీల్డ్‌మ్యాప్ బుక్) వంటి రికార్డులను తయారు చేశారు. రెవెన్యూ గ్రామాలు వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, బూడిదపాడు, కుచ్చుపాప, పల్లవోలు, చాపాడు, చియ్యపాడు, చిన్నగురవలూరు, నెర్రవాడ, కేతవరం, మదూరు, సోమాపురం, మొరాయిపల్లె, వెంగన్నగారిపల్లె, పిచ్చపాడు, పెద్దగురవలూరు, బద్రిపల్లె, అల్లాడుపల్లె ఉన్నాయి. వీటిలో తుమ్మలపాడు, బూడిదపాడు, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాలు 1950 నుంచి మాయమయ్యాయి. బ్రిటిష్ వారు తయారు చేసిన రికార్డుల ప్రకారం తుమ్మలపాడులో 257.54 ఎకరాలు, బూడిదపాడులో 1070.19 ఎకరాలు, పిచ్చపాడులో 996.49 ఎకరాలు భూములు ఉన్నాయి. పిచ్చపాడుకు ఉపగ్రామాలుగా జడ్డిగారికొట్టాలు, ద్వారకానగర్ ఉన్నాయి. తుమ్మలపాడు, బూడిదపాడుకు ఉపగ్రామాలు లేవు. సుమారు 70 ఏళ్లగా ఆ గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామాలను వదిలి వేరే గ్రామాల్లోకి వెళ్లి స్థిరపడ్డారు. తుమ్మలపాడులో సుమారు 70 కుటుంబాలవారు ఉండేవారు. ఇతర గ్రామాలతో రాకపోకలు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులంతా పక్కగ్రామాలైన అయ్యవారిపల్లె, రాజువారిపేట, సీతంపల్లె గ్రామాలకు వెళ్లిపోయారు. బూడిదపాడులో ఉన్న 150 కుటుంబాలవారు పక్క గ్రామాలైన పెద్దగురవలూరు, చిన్నగురవలూరు గ్రామాలకు వెళ్లిపోయారు. కొందరు శ్రీరాములపేట అనే కొత్త గ్రామాన్ని నిర్మించుకున్నారు. ఈ గ్రామం కుందూ నది వద్దన ఉండడంతో వరదనీరు ఆ గ్రామంలోకి వచ్చేవని గ్రామస్థులు తెలిపారు. అందువలన నష్టం జరుగుతుండడంతో ఇల్లు పడిపోతుంటాయి. పిచ్చపాడు గ్రామంలో సుమారు 40 ఇళ్లు ఉండేవి. ఆ గ్రామం వద్ద వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామంలోకి వచ్చేవని తెలిపారు. ఇళ్లలోని సామాన్లు కొట్టుకు పోయేవన్నారు. నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో గ్రామస్థులు పక్కగ్రామాల్లో మామిళ్లపల్లె, కొత్తపల్లె, సిద్దారెడ్డిపల్లె, ద్వారకానగరం, మైదుకూరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇలా మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ గ్రామాలు పేర్లు మాత్రమే వాడుకలో ఉన్నాభౌతికంగా ప్రజలు లేరు, గ్రామాలూ లేవు. లేని గ్రామాలను రికార్డుల్లో చూపించడం సమంజసం కాదని ఆ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈనెల 24న అయ్యవారిపల్లెనూ, 27న పెద్దగురవలూరు, 19న సిద్దారెడ్డిపల్లెలోనూ రెవెన్యూ సదస్సుల సందర్భంగా అధికారులు గ్రామసభలు నిర్వహించారు. జిల్లా అధికారులు ఈ మూడు పేర్లను తొలగించి వాటిస్థానంలో ప్రస్తుతం ఉన్న పక్క గ్రామాలపేర్లతో రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయడం అవసరం ఎంతైనా ఉంది.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

పోరుమామిళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన భార్య నాలుగురోజులుగా కనిపించడం లేదని మల్లికార్జున స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోరుమామిళ్ల మండలం చల్లగిరిగెల వాసులు మల్లికార్జున భార్య కావ్య నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి ఆటోలో వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియ రానందుకు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి


పట్టాల వద్ద మృతదేహం

ముద్దనూరు డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ బిడ్జి కింద నున్న రైల్వే పట్టాల వద్ద శనివారం రైలు కింద పడి మూరబోయిన మనోజ్(23) మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్‌ఐ సమాచారం మేరకు... ముద్దనూరు మండలం ఆరవేటిపల్లె వాసి మనోజ్ బీటెక్ చదువుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగాలేకపోవడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జగనన్న కాలనీల భూముల కొనుగోలుపై

విజిలెన్స్ విచారణ

రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం రైతుల విచారణ ● పరిహారం చెల్లింపు రికార్డుల పరిశీలన


రామేశ్వరం రైతులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట రైతుల నుంచి సేకరించిన వందలాది ఎకరాల భూముల వ్యవహారంలో వైసీపీ నేతలు కొందరు దళారులను ముందు పెట్టి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. చౌటపల్లె పంచాయతీ బొల్లవరం పొలంలో 213 ఎకరాలు, సోములవారిపల్లె పంచాయతీ రామేశ్వరం పొలంలో 155.67 ఎకరాలు, కొత్తపల్లె పంచాయతీ మీనాపురంలో 109,56 ఎకరాలు పేదల ఇళ్ల పట్టాల కోసం జగనన్న కాలనీల పేర వైసీపీ ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఇందులో రామేశ్వరం పొలంలో ఎకరాకు రూ.27.5లక్షలు బొల్లవరం, మీనాపురంలలో రూ. 40లక్షలు వంతున చెల్లించింది. మొత్తం 478.67 ఎకరాలకు రూ. 167 కోట్లు ప్రభుత్వం ద్వారా భూసేకరణలో రైతులకు చెల్లించారు. వాస్తవానికి ఆరోజుల్లో ఆ భూములకు మార్కెట్‌లో అంత విలువ లేకున్నా మూడింతలు అదనంగా పరిహారం చెల్లించారు. ఆ భూములు కొనుగోలు వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ముందస్తు వ్యూహంలో భాగంగా నివాసయోగ్యం కాని వ్యవసాయానికి సైతం పనికిరాని బీడు భూములను కొనుగోలు చేయించి పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు వెంచర్ల రేట్లు పెంచేందుకు యత్నించారని ఆరోపణలున్నాయి. మార్కెట్ విలువ కంటే మూడింతలు అదనంగా నష్టపరిహారం అందించినందుకు దళారుల ద్వారా అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రైతుల నుంచి పెద్ద ఎత్తున కమీషన్లు పొందినట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి భూసేకరణలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు రోజులుగా ప్రొద్దుటూరులోని రామేశ్వరం బొల్లవరం మీనాపురం జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ భూములు ఇచ్చిన రైతుల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి తీసుకున్నారు. జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. రామేశ్వరం లో భూములిచ్చిన కొందరు రైతులతో విజిలెన్స్ అధికారులు మాట్లాడారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం నేరుగా అందిందా లేదా అని ఆరా తీశారు. అందిన పరిహారంలో దళారులకు, అధికారులకు ఏమైనా కమీషన్లు ఇచ్చారా అని విచారించారు. ముఖ్యంగా ఆరోజుకు అక్కడ వున్న ల్యాండ్ విలువను పరిశీలిస్తున్నారు. అందులో డీకేటీ, అసైన్డ్, పట్టా తదితర ల్యాండ్లపై పరిశీలిస్తున్నారు. ఈ విజిలెన్స్ విచారణలో డీఈ జవహర్‌రెడ్డి అగ్రికల్చర్ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ అశోక్‌కుమార్ కానిస్టేబుల్ రంతూబాషా వున్నారు. జగనన్నకాలనీల కోసం జరిగిన భూసేకరణలో జరిగిన అక్రమాలపై రైతులందరినీ విచారించి వారిచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా అక్కడ భూమి వాస్తవ విలువను బట్టి అప్పటి అధికారులు చెల్లించిన నష్టపరిహారంపై అంచనావేసి ప్రభుత్వానికి నష్టం చేకూర్చినట్లు తేలితే వాటి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని విజిలెన్స్ డీఈ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

మట్కా స్థావరాలపై దాడులు

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు అరెస్టు

రూ.52,170 నగదు, పట్టీలు స్వాధీనం

ప్రొద్దుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ ఏరియాలో సాగుతున్న మట్కాదందాపై జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలతో మట్కా స్థావరాలపై టూటౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. శనివారం సాయంత్రం జరిపిన వేర్వేరు దాడుల్లో దస్తగిరి పేట వాసులు పల్లె ప్రశాంత్, తలారి మైఖేల్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి మట్కా సంబంధించి రూ .25,800 నగదు స్లిప్పులు, రెండు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జిన్నా రోడ్డులోని కెనరా బ్యాంకు వద్ద మట్కా స్థావరంపై దాడులు చేసి దస్తగిరి పేటకు చెందిన షేక్ బషీర్‌అహ్మద్, దాదాగారి గౌస్‌బాషా, సాయిరాజేశ్వరీ కాలనీలో ఉంటున్న షేక్ మునీర్, మోడంపల్లెకు చెందిన పటాన్ జుబేర్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 26,370 నగదు పట్టీలు, మూడు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శనివారం పట్టణంలో పని ముగించుకుని రామారావుకాలనీ, ఆటో స్టాండ్ వద్ద వెళుతున్న వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వస్తూ ఢీకొట్టి వెళ్లిపోయారు. రోడ్డుపై పడి గాయాలపాలైన వృద్ధుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. బాధితుడి కుమారుడు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'ధర్నా తాత్కాలిక వాయిదా'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఈఓ వైఖరిపై ఉపాధ్యాయ సంఘాలు చేపట్టనున్న ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. 30వ తేదీన ధర్నా అంటూ శనివారం కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు ఐక్యవేదిక ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆర్జేడీ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సమయం ఇవ్వాలని కోరగా ఉపాధ్యాయ సంఘాల వేదిక సమ్మతించి తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. సమావేశంలో ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్టీయూ, ఆర్‌యూపీపీ, ఆపస్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, ఎస్‌టీఏఎస్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీకే పల్లెలో భూ వివాదం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీకేపల్లెలో శనివారం భూ వివాదం చోటు చేసుకుంది. సర్వే నెంబరు 521లో ఐదెకరాల 56 సెంట్లు భూమి మోడీ రామన్నకు ప్రభుత్వం పట్టా ఇవ్వగా ఆయన తమ్ముడు చెంగన్న రెండెకరాలు, గంగమ్మకు రెండు ఎకరాల78 సెంట్లు వారసత్వంగా వచ్చింది. ఈ భూమి సమీపంలో బైపాస్‌రోడ్డు రావడంతో కుంట రూ.40 లక్షలకు పైగా పలుకుతోంది. దీంతో గంగుల్‌రెడ్డి నుంచి కృష్ణారెడ్డి కొనుగోలు చేశాడని సర్వే చేయడానికి తమ భూమిలోకి వచ్చారని బాధితులు తెలిపారు. సర్వే అధికారులను అడ్డగించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు



శనీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

నందలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ పక్కనే ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

మండల బీజేపీ అధ్యక్షుడుగా ముక్కా రూపేష్ రెడ్డి



రూపేష్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడుగా ముక్కా రూపేష్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకుడు వీటీ చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి.చెంగల్‌రాజు, మోర్చా అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి కృషి

ఓబులవారిపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంగంపేటలో రాజకీయ విభేదాలు ఏమీ లేవని కూటమి నాయకులతో కలిసి పనులు చేస్తున్నామని మంగంపేట టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, అనమలగుండం చంద్రమోహన్, రాయుడు తెలిపారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డితో కలిసి ఏపీఎండీసీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గునిపాటి చిన్న రాయుడు, గునిపాటి కిరణ్‌కుమార్, గునిపాటి వేణు తదితర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఈద్గా దారిలోని కట్టడాలు తొలగించాలి

సిద్దవటం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఈద్గా వెళ్లే దారికి అడ్డంగా నిర్మాణాలు చేస్తుండడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా మాట్లాడుతూ సర్వేనంబరు 410 నుంచి సర్వేనంబరు 21 వరకు బండ్లబాటగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని, ఈద్గా మైదానానికి వెళ్లే రహదారికి అడ్డంగా నిర్మించిన కట్టడాలు తొలగించాలని కోరుతూ సీఎంవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి భూ సమస్యకు పరిష్కారం చూపుతాం

సంబేపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపుతామని తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు.శనివారం సంబేపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ. సంబేపల్లె గ్రామంలో రీసర్వే చేయడం వల్ల జాయింట్ కింద కొన్ని నెంబర్లు రావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రీ సర్వే చేయడం వల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నమైన విషయం వాస్తవమేనని, ఆయా సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు. జాయింట్ ఎల్పీఎం నెంబర్లు రావడం వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇలాంటి భూము లను సర్వే చేసి ప్రతి నెంబర్‌కు ఒక ఎల్పీఎం నెంబర్‌ని కేటాయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంచల రామచంద్ర, వీఆర్వో మల్లీశ్వరి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మహిళా మండలి భవనం

● అర్ధాంతరంగా ఆగిన నిర్మాణం ● అసాంఘిక కార్యక్రమాలకు నిలయం ● పట్టించుకోని పాలకులు, అధికారులు



రైల్వేకోడూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబజారు వీధిలో మహిళా మండలి సమావేశ భవనం అసంపూర్తిగా మిలిగింది. అదే కాకుండా నిరుపయోగంగా మారింది. ఇటు పాలకులు, అటు అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకోనుంది. భవనం పూర్తి కాకపోవడంతో రాత్రి వేళల్లో గతంలో భిక్షాటన వేసేవాళ్లు నివాసం ఉండేవారు. ప్రస్తుతం ఈ భవనంలో అసాంఘిక కార్యక్రమాలు సాగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వివరాల్లోకి వెళితే

1976లో పంచాయతీ పరిధిలోని రూఫ్సీ మహిళా మండలికి అప్పటి సర్పంచ్ కొమ్మూరు సుబ్బన్న గ్రామ పంచాయతీ తరఫున ఒకటిన్నర సెంటు స్థలాన్ని కేటాయించారు. అప్పట్లో సమితి ప్రెసిడెంటుగా ఉన్న కట్టా నారాయణయ్యనాయుడు ఈ భవనానికి నిధులు కేటా యించారు. అయితే, నిధులు సరిపోకపోవడం, సిమెంటు, ఐరన్, ఇటుక తదితర ధరలు పెరిగిపోవడం వంటి కారణాలతో భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. ఆ తర్వాత పాలకులు ఈ భవనాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, నిధులు సమకూర్చినా భవనం అసంపూర్తిగా నిలిచిపోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేస్‌మెంటు, గోడలు, శ్లాబు నిర్మాణం పూర్తి కాగా. పూతలు, ఫ్లోరింగ్ , ద్వార బంధాలు, కిటికీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటిని పూర్తి చేయాలంటే సుమారు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న మహిళా మండలి భవనాన్ని పూర్తి చేయాలని మహిళలు కోరుతున్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి



ఎంతో కాలంగా భవనం అసంపూర్తిగా ఉంది. అప్పట్లో నిధులు సమకూర్చినా నిర్మాణం పూర్తి చేయలేక పోయారు. ప్రస్తుత పాలకులైనా నిధులు మంజూరు చేస్తే మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.

- బండారు సుభద్రమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు

సమస్యల పరిష్కారంలో ఎన్సీడబ్ల్యూ ప్రధాన పాత్ర

చిన్నమండెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధాన్ సే సమాధాన్ జాతీ య మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన్న మండెం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లు నాగేశ్వరరావు, నాగరాజు మాట్లాడుతూ గృహహింస, వరకట్న వేధింపులు, మహిళలపై క్రూరత్వం, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్‌రేప్, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, మహిళల ఫిర్యాదులను పరి ష్కరించడంలో జాతీయ మహిళా కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. వైద్య, పోలీసు సహాయం, మానసిక సామాజిక మద్దతు , న్యాయ సహాయం, షెల్టర్ వంటి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. బేటీ బచావో బేటీ పడావో, లింగ అసమానత, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీం, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ 78271 70170 ప్రతి విద్యార్థి తమ మొబైల్‌లో ఫీడ్ చేసుకోవాలన్నారు. న్యాయసహాయ దరఖాస్తు మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం ఎంపీడీవో, మహిళలు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న అధికారులు

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

రాయచోటి టౌన్: బాలికలకు చట్టాలపై అవగాహన అవసరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా తెలిపారు. శనివారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా చట్టాలు, బాలికల కర్తవ్యాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు, తల్లిదండ్రుల మాటలు గౌరవించాలని, సత్ప్రవర్తనతో బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషుల కన్నా ఏ విషయంలో తక్కువ కాదని, అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని చెప్పారు. అనంతరం న్యాయవాదులు నాగేశ్వరరావు, నాగరాజ, కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా

రాజ్యాంగబద్ధ పదవులను అపహాస్యం చేయవద్దు

● మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుషాధిక్యంతో సమసమాజ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజ్యాంగపరమైన హక్కులు కాపాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వెంకట్రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యంగా రాయచోటిలో అధికారులను ఆఫీసులోనూ, ఉపాధ్యాయులను క్లాస్‌రూముల్లోనూ రౌడీ షీటర్‌లు కొట్టి గాయపరిచి చంపేస్తున్నారన్నారు. మరోవైపు మహిళా ప్రజాప్రతినిధులను వంటింటికి పరిమితం చేస్తూ వారి హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రకారం వ్యవస్థను చెడగొట్టే కొంత మంది రౌడీ షీటర్లు, అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల స్థానంలో పురుషులు జోక్యం చేసుకుంటే రాజ్యాంగ ఉల్లంఘన కింద కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు విధులకు ఆటంకం కలగజేసే వారిని జిల్లా నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మాధవయ్య, యూనియన్ నాయకులు శివశంకర్, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

రాయచోటిటౌన్, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని సందీప్ స్కూల్‌లో డైరెక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలామ్స్ విజన్-2024 సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఇలాంటి సైన్స్ ప్రదర్శన నిర్వహించడం వలన విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ తదితర అంశాలపై అవగాహనతో పాటు చదువు మీద ఆసక్తి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిభా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి, లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జీఎంటీ కోఆర్డినేటర్ పీఎస్ హరినాథరెడ్డి, న్యాయ నిర్ణేతలు ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, ప్రకాశ్‌రెడ్డి, సందీప్ స్కూల్ కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి

పని వేళలు పాటించని అధికారులు

సిద్దవటం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పని వేళలు ప్రారంభమై అరగంట గడిచినా ఉద్యోగులెవరూ విధులకు హాజరు కాకపోవడంతో శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

ఈ కార్యాలయంలో 9 మంది ఉ ద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా టైపిస్టుతోపాటు మ రో ఉద్యోగి విధులకు హాజరయ్యారు. కార్యాలయంలో ఫొటోలు తీస్తున్న విషయాన్ని ఆ ఉద్యోగులు ఫోన్ ద్వారా ఎంపీడీవోకు తెలియజేయడంతో ఆయన మాట్లాడుతూ తాను విధి నిర్వహణ నిమిత్తం కడపలో ఉన్నానని, కొంతమంది ఉద్యోగులు సెలవులో ఉన్నారని తెలిపారు. ఫొటోలు ఎవరు తీయమన్నారంటూ హుంకరించారు. ఈ విషయమై డిప్యూటీ సీఈవో మైథిలిని వివరణ కోరగా విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



ఉద్యోగులు హాజరుకాక పోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఉప ముఖ్యమంత్రిని కలిసిన సుగవాసి సోదరులు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను శాలువాతో సన్మానిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల దాడిలో గాయపడి కడప రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పరామర్శించారు. అనంతరం, గాలివీడుకు వెళుతూ మార్గమధ్యంలో రాయచోటి పట్టణంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గువ్వలచెరువులో ఘనస్వాగతం

రామాపురం: మండల కేంద్రంతోపాటు గువ్వలచెరువు లో శనివారం టీడీపీ, జనసేన నాయకులు, కా ర్యకర్తలు,మహిళలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికారు. గాలివీడుకు వెళుతున్న పవన్‌కల్యాణ్ ప్రజలను చూసి కాన్వాయ్‌ని ఆపారు. ప్రజలకు అభివాదం చేసి వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

ఎంపీడీవోపై దాడి అమానుషం



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నేతల దాడి అమానుషం అని అన్నమయ్య జిల్లా ఎంపీడీవోల సంఘం పేర్కొంది. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం డీఆర్‌వోకు వినతిపత్రం అంద జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎంపీడీవోలకు భద్రత లేకుండా పోయిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. గతంలోకూడా ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఎంపీడీవోలు హాజరయ్యారు.

నల్ల బ్యాడ్జిలతో సిబ్బంది నిరసన



నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న పెనగలూరు మండల పరిషత్ సచివాలయ సిబ్బంది

పెనగలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై శుక్రవారం వైసీపీ నాయకుల దాడిని ఖండిస్తూ శనివారం పెనగలూరు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మభూషణ్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సచివాలయ సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రౌడీయిజం నశించాలి దౌర్జన్యాలను అరికట్టాలి అంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవో జవహర్‌బాబుకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఎంపీడీవోకు జనసేన నేత పరామర్శ



ఎంపీడీవోను పరామర్శిస్తున్న జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ

సిద్దవటం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడి దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును శనివారం జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వ్యక్తిపై దాడి చేయడం నీచమైన చర్య అని, అధికారంలో ఉన్నప్పుడు చేసిన దౌర్జన్యాలు కూటమి ప్రభుత్వంలో చేస్తామంటే కుదరదన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్క కుండా ప్రజలు తీర్పు ఇచ్చినా, ప్రభుత్వ అధికారులపై పెత్తనం చెలాయించాలని చూస్తే చట్టాలు ఎవరి చుట్టం కాదని గుర్తు పెట్టుకోవాలని ఆయన అన్నారు. గాయపడ్డ ఎంపీడీవో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగిపై దాడిచేయడం తగదు

సిద్దవటం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దళిత వ్యక్తి గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైఎస్‌ఆర్‌పార్టీ గూండాలు ఒక దళిత అధికారిపై దాడి చేయడం పిరికి పంద చర్య అని ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె తన ఇంట్లో మాట్లాడుతూ ఆయన గతంలో సిద్దవటం ఎంపీడీవోగా విధులు నిర్వహించి ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. ఆయనపై దాడి చేసినవారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. .

'మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం'

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణా న్ని కాపాడాలని శ్రీ వెంకటేశ్వర ఎయిడెడ్ జూనియర్ క ళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను నిషే ధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ వెంకటకృష్ణారెడ్డి. అధ్యాపకులు కళ్యాణి, శాంతయ్య, శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఏపీ మోడల్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి); రేపు సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ జరుగుతుందని మండలంలోని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనాలని మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28న పాఠశాల స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులు మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సైన్స్ ఫెయిర్ ఉంటుందని వారు తెలిపారు. కావున ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనాలన్నారు.

5న ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణోత్సవం

రాజంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో జనవరి 5న తిరుప్పావై భక్తసేవాసమితి ఆధ్వర్యంలో గోదాదేవి, మహాలక్ష్మి , ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రతినిధి సరిత తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలకు సౌమ్యనాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ధనుర్మాస పూజల్లో భాగంగా 5వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిసామన్నారు. రెండేళ్లుగా ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఈ ఏడాది తోట కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కల్యాణం రోజున ఉదయం 7 గంటలకు గోపూజ, తులసి పూజ, 8 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణం, తిరుప్పావై పారాయణం, 8.30 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం ఉంటుందన్నారు. 9 గంటలకు శ్రీ ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస్ వారి ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రతిభకు నగదు పురస్కారం

పుల్లంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టి.కమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ సబ్జెక్టులో ప్రతిభ చూపిన విద్యార్థినికి హిందీ ఉపాధ్యాయుడు సర్తాజ్ హుస్సేన్‌ను నగదు పురస్కారంతో అభినందించారు. సమ్మేటివ్-1 పరీక్షల్లో హిందీలో 100కు 93 మార్కులు సాధించినందుకు విద్యార్థిని కె.అమృతను అభినందించి హెచ్ఎం భవిత వెయ్యి రూపాయల నగదు పురస్కారం అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో 90 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులందరికి నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు,

రెవెన్యూ సదస్సులో సర్వేయర్‌కు అస్వస్థత

నందలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్తపి గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల సర్వేయర్ ప్రభాకర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి ఉన్నత వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది.



చెన్నంశెట్టి విష్ణుస్వరూప్

ఇతని పేరు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఏకైక కుమారుడు. ఇతడి వయస్సు 40 సంవత్సరాలు. ఏమైందో ఏమోగాని శనివారం ఉదయం 11 గంటలకు గుండెపోటుతో హైదరాబాదులోని వారి స్వగృహంలో హఠాన్మరణం చెందారు. తన ఏకైక కుమారుడు విష్ణుస్వరూప్ హఠాన్మరణం చెందడంతో ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుటుంబం కుప్పకూలిపోయింది. అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నత స్థానాల్లో నిలబెట్టి తనివితీరా చూడాలనుకున్న ఆ తండ్రి, ఆ కుటుంబ ఆశలు అడియాశలయ్యాయి.



- అధికమవుతున్న గుండెపోట్లు
- విద్యార్థుల నుంచి యుక్త వయస్సు వారికీ...
- పెరిగిపోతున్న హఠాన్మరణాలు
- ఆహార అలవాట్లు మారడం.. జంక్‌ఫుడ్ తీసుకోవడం
- శారీరక శ్రమకు దూరమవుతున్న పర్యవసానం



గుండె ఆగిపోతోంది..!

అధిక ఒత్తిడి వల్లే..



అధిక ఒత్తిడి వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మానవునికి దైనందిన జీవితంలో ఏదో ఒక దానిపై ఒత్తిడి పెరుగుతోంది. ఎప్పుడు ఒత్తిడి పెరుగుతుందో గుండెకు బరువు పెరుగుతుంది. గుండెపోట్లకు హఠాన్మరణం చెందడానికి ఫలాన కారణమని కచ్చితంగా చెప్పలమే. వ్యక్తుల శరీరాలు వారి జీవన విధానం, శరీర ఆకృతి, ఇత్యాది కారణాల వల్ల గుండెపోట్లు వస్తున్నాయి. వైద్యుల సలహాల మేరకు నడుచుకుని నిత్యం వ్యాయామం చేస్తూ తగు మోతాదులో ఆహారం తీసుకుంటూ ఉంటే ఏ గుండెజబ్బు రాదు.

- డాక్టర్ సానె శేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, రాజంపేట

శారీరక శ్రమ ఉండాలి...



నిత్యం వాకింగ్, వ్యాయా మం చేస్తే గుండెపోటు రాదు. ఎవరైనా పరిశీలించండి. నూటికి 90 శాతం మనిషికి వ్యాయామం, వాకింగ్, ధ్యాన ప్రక్రియ చేసిన వారికి గుండెపోటు రాదు. ఏవేవో కొవ్వు పదార్థాలు తింటూ ఇంటి వద్దనే ఉంటూ అధిక బరుకు గురై దురలవాట్లకు లోనై అధిక ఊబకాయం ఉంటే గుండెపోటు ఎందుకు రాదు. మనిషి తన శరీరానికి నిత్యం పని కల్పించాలి. రక్త ప్రసరణ బాగా జరిగే రీతిలో పనులు చేసుకుంటూపోతే గుండెపోటు అసలే రాదు.

- డాక్టర్ సంగరాజు బాలరాజు, గుండె వైద్య నిపుణులు, రాజంపేట

రాజంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎందుకనో ఏమో... గత ఏడాదిగా గుండెపోట్లు పెరిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా వారానికి ఇద్దరో ముగ్గురో గుండెపోటుతో చనిపోతున్నారు. మామూలుగా అయితే శారీరక శ్రమ తక్కువగా ఉండి, ఎక్కువ ఒత్తిడి కలిగి ఉండి, భారీ కాయం కలిగి ఎటువంటి శ్రమ చేయకుండా ఇంటిపట్టునే ఉండి ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ అలవాట్లు ఉండి ప్రధానంగా షుగర్, బీపీ కలిగి ఉన్నవారు అందునా వయస్సు పైబడినవారు గుండెపోటుకు గురై మరణించినట్లు వింటుంటాం. అయితే ఇటీవల చిన్నారులు, 20 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువకులు, పెళ్లికాని వారు, యుక్త వయస్కులు ఎక్కువమంది చనిపోతున్నారు. శనివారం ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఏకైక కుమారుడు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్ (40) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. అదేవిధంగా రాజంపేటలో ప్రముఖ వాస్తు ప్లానర్ రజనీకాంత్ శనివారం ఉదయం బాత్‌రూంకు వెళ్లి అక్కడికక్కడే గుండెపోటుకు గురై మృతి చెందారు. గత ఏడాది ఓబులవారిపల్లె మండలం గురుకుల పాఠశాలలో 13 ఏళ్ల విద్యార్థి గుండెపోటుతో మరణించిన సంఘటన అందరినీ కలచివేసింది. వికారాబాద్ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మేఘన అనే విద్యార్థిని రెండు రోజుల కిందట సహ విద్యార్థులతో ఆడుకుంటూ కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందడంతో రాజంపేటకు చెందిన మేఘన సహచర విద్యార్థులు తల్లడిల్లిపోయారు. ఇటీవల మూడు నెలలుగా పరిశీలిస్తే నెల రోజుల కిందట రాజంపేటలో నిత్యం యోగాభ్యాసం చేస్తూ అందరికీ యోగ, ధ్యానం నేర్పుతూ యోగా గురువుగా గుర్తింపు పొందిన టి.రెడ్డయ్య (50) రాజంపేటలో గుండెపోటుతో మృతిచెందారు. యోగ, ధ్యానం నేర్పే గురువుకే హఠాత్తుగా గుండెపోటు రావడం, అతను మరణించడం కలచివేసింది. తదనంతరం వారం రోజులకే జిల్లాలో ప్రముఖ ఏఐటీయూసీ నాయకుడు, ఉద్యమ నేత ఎంఎస్ రాయుడు చనిపోయే గంట ముందు వరకు ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఇంటికి వచ్చి అకస్మాత్తుగా గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. నందలూరు మండలంలో పెయింటర్‌గా పనిచేసుకుంటూ జీవించే 25 ఏళ్లు కూడా నిండని పెళ్లి కాని శ్రీనివాసులు గుండెపోటుతో మరణించాడు. ఇదే నందలూరులో ఇటీవల ఓ రోజు ఉదయం 7 గంటలకు పేపరు చదువుకుంటూ జయరామిరెడ్డి అనే వ్యక్తి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతానికి చెందిన బి.రామరాజు అనే ఎలక్ట్రీషియన్ హఠాన్మరణం చెందారు. పెనగలూరులోని పాత సింగనమల గ్రామానికి చెందిన కాలి లక్ష్మీనారాయణ అనే 22 ఏళ్ల యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు పంచాయతీలో 50 ఏళ్ల లోపు ఒక మహిళ, అదే ప్రాంతంలో 37 ఏళ్ల ఓ యువకుడు, మంగంపేటలో మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. రాజంపేట నలంద కళాశాల పక్కనే నివాసముంటున్న పి.వెంకటయ్య స్నేహితుడితో మాట్లాడుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇటీవల అతనికి రెండు స్టంట్లు కూడా వేశారు. అయినా ఎందుకనో మృతి చెందారు.

చిట్వేలిలో ఇటీవల విశ్వేశ్వరగౌడ్ అనే 50 ఏళ్ల మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. విశ్వేశ్వరగౌడ్ నిత్యం వాకింగ్ చేస్తూ వ్యాయాయం చేస్తూ సన్నగా ఉన్నా గుండెపోటుతో మృతి చెందాడు. పుల్లంపేటలో కువైట్ నుంచి వచ్చిన 55 ఏళ్ల వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య ఉదయం ఈశ్వరాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మరో నాలుగు చోట్ల వ్యక్తిగత పనులు చూసుకుని పొలం వద్దకు వెళ్లి పొలంలోనే గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఒంటిమిట్ట మండలం పెద్ద కొత్తపల్లె గ్రామానికి చెందిన 56 సంవత్సరాల చెంగయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే గుండెపోటుతో మరణించారు. ఈ విధంగా చెప్పుకొంటూపోతే ఊరికొకరు, వీధికొక్కరు అన్న చందంగా గుండెపోటుతో మరణిస్తున్నారు. మృతులు వందలాది మందికి చేరుతున్నారు. ప్రస్తుత వర్షాకాల, శీతాకాల సమయంలో చలి ఎక్కువగా ఉండడం శ్వాసక్రియ నెమ్మది అయి ఊపిరితిత్తుల్లో నీరు చేరి చనిపోతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఒక్కో మండలాన్ని పారదర్శకంగా తీసుకుంటే గత నెలల్లోనే గుండెపోటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య 20 మందికి తగ్గడం లేదు. అందునా విద్యార్థులు, యువకులు, పెళ్లికాని వయస్కులు, నడి వయస్సు వారు ఎక్కువగా చనిపోవడం కలత కలిగించే అంశం. కుటుంబ భారాన్ని మోసేవారు చనిపోవడం వల్ల ఆయా కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి.

రాజంపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గుండెపోటుతో మృతి చెందిన వారు...



లక్ష్మీనారాయణ (పెనగలూరు), శ్రీనివాసులు (నందలూరు), బ్రహ్మయ్య (తాళ్లపాక), గంగయ్య (పెద్దకొత్తపల్లె), చిన్నబ్బిశెట్టి (పుల్లంపేట), రజనీకాంత్ రాజంపేట)

- మన చిన్నతనంలో ఉన్నట్టు పాఠశాలకు నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడం, పాఠశాలల్లో క్రీడా మైదానాలే లేకపోవడం, చిన్నతనంలో అసలే వ్యాయామం లేకపోవడం వల్ల విద్యార్థి దశలోనే గుండెపోట్లు వస్తున్నాయి.
- ఎక్కువగా యువకులు, చిన్నారులు జంక్‌ఫుడ్ తీసుకోవడం, ఆహార నియమాల్లో ఎంతో తేడా రావటం, రసాయన ఎరువులతో పండే ఆహారాన్ని తినడం మరో ప్రధాన కారణంగా చూపుతున్నారు.
- బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నవారు వ్యాయామం చేయకపోవడం, ఆహార నియమాలను పాటించకపోవడం, కొవ్వు పదార్థాలు ఉన్న మటన్ లాంటి ఆహారం తీసుకోవడం వల్ల కూడా గుండెపోట్లు వస్తున్నాయంటున్నారు. ఎక్కువగా ఈ మధ్య ధూమపానం, మద్యపానానికి అలవాటు పడడం, ఈ గుండెపోట్లకు ప్రధాన కారణం అంటున్నారు.
- శారీరక శ్రమ లేకుండా, వ్యాయామం చేయకుండా ఎక్కువ కొవ్వు పదార్థాలు తింటూ ఉండడం గుండెపోటుకు ప్రధాన కారణం. వృత్తిపరమైన ఒత్తిడి కలిగి ఉండడం అధికంగా ఆలోచించడం, అధిక బరువు కలిగి ఉండడం కూడా ప్రధాన కారణమని చెబుతున్నారు.
- ప్రధానంగా ఒత్తిడి ఎక్కువగా ఉండడం, నిద్రలేనితనం, రక్తం గడ్డకట్టడం లాంటి కారణాలు ప్రధానం.



జీవనశైలిలో మార్పుతోనే...

మానవుడి జీవనశైలి మారడం వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మన పూర్వీకులు తెల్లవారు జాము నుంచే పంట పొలాలకు వెళ్లి పని చేసుకునేవారు. సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు పండించుకుని పోషక పదార్థాలను తినేవారు. ఎక్కువగా శారీరక శ్రమ కలిగి ఉండేవారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు కనీసం ఐదు మీటర్లు వెళ్లి క్రీడా మైదానంలో బాగా ఆడుకుని ఇంటికి వచ్చేవారు. ఇప్పుడంతా మారిపోయింది. నేటి హైటెక్ యుగంలో మానవ జీవనశైలే మారిపోయింది. పనిచేసేవారే లేకుండా పోయారు. కొవ్వు పదార్థాలు తిని సెల్ చూసుకుంటూ పనీపాటా లేకుండా ఉంటే గుండెపోట్లు రాకుండా ఎలా ఉంటాయి.



- లావులూరి శ్రీనివాసులు, జిల్లా మలేరియా మాజీ అధికారి, రాజంపేట.



అయ్యో.. పాపం చిన్నారులు...

● ఉరి వేసుకుని తండ్రి ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యో పాపం ఆ చిన్నారులు.. తండ్రి చనిపోయాడని వారికి తెలియదు. తల్లి భోరున విలపిస్తుండటం చూసి వారు కూడా ఏడుస్తుండటం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఇద్దరు చిన్నారులను అనాథలను చేసి వెళ్లిపోయాడే అంటూ ఆ తల్లి రోదనలను చూసి ఆ చిన్నారులు ఏమి జరిగిందో తెలియక దిక్కుతోచని స్థితిలో వారు కూడా ఏడుస్తూనే ఉన్నారు. ఈ ఘటన శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె గజ్జలకుంట వద్ద మదర్‌మీరా స్కూల్‌లో ఓ గదిలో కాపురం ఉన్న శ్రీనివాసులు (32) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను చూసిన స్కూల్ పిల్లలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగానే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు... మృతుడు శ్రీనివాసులు తంబళ్లపల్లె మండలం, మూలపల్లె నుంచి పదేళ్ల క్రితం మదనపల్లెకు బతుకుదెరువు కోసం వచ్చాడని, 5 ఏళ్ల క్రితం మదనపల్లెకు చెందిన విజయలక్ష్మీతో వివాహం చేసుకున్నాడు. మదర్ మీరా స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవలే మానివేసి చిప్పిలి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో వంటమనిషిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్కూల్‌లో పనిచేస్తున్న సమయంలో కాపురం ఉండేందుకు గది ఇచ్చారని చెప్పారు. ఇతను మద్యం తాగి భార్యను కొట్టేవాడని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో నాలుగురోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఆతనికి భార్యతోపాటు దేవాన్ష్ (4) కుమారుడు, దేవాన్షీ(3) కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



శ్రీనివాసులు మృతదేహం



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న చిన్నారులు



సూర్యుడే.. గజగజ...

లోకానికి వెలుగులు నింపే సూరీడు మంచు గుప్పిట్లో చిక్కుకున్నాడు. శనివారం ఉదయం ములకలచెరువులో దట్టమైన పొగమంచు అలుముకుని తీక్షణ కిరణాల భానుడు కూడా చినబోయి ముఖం చాటేశాడు. ఉదయం 9 గంటలైనా ఎండ జాడ కన్పించలేదు. అలాగే మంచు దుప్పటితో జాతీయ రహదారి కన్పించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- ములకలచెరువు (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు నిరంతరం పోరాటం అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార యాత్రల్లో భాగంగా శనివారం రాయచోటిలో ప్రచారయాత్రను ప్రారంభించారు. ఈ జాత రాయచోటి నుంచి బయలుదేరి గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, వాయల్పాడు మీదుగా పీలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలు ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా జరుగుతున్నాయని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ మహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు ప్రవేశపెట్టి విస్తృతంగా చర్చలు జరిపి వాటి సాధన కోసం ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. జనవరి 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు పాల్గొంటారని, అలాగే వివిధ రాష్ట్రాల విద్యాశాఖ ప్రముఖులు, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావుద్దీన్, ఆదినారాయణ, పురం వెంకట్రమణ, అక్రమ్‌బాషా, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్రారెడ్డి, ప్రచురణల విభాగం కన్వీనర్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహాసభల ప్రచార యాత్రలో యూటీఎఫ్ నాయకులు

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

కురబలకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన చక్రిమ్మ (90) బతుకుదెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం మండలంలోని అంగళ్లుకు వచ్చి స్థిరపడింది. కాగా ఆమె సంతలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. ఆరోగ్యం ఆమెకు సహకరించకపోవడంతో కూరగాయలు అమ్మడం మానేసి, భిక్షాటన చేస్తుంది. కాగా మండలంలోని అంగళ్లు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలిని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దూడకు నీరు తాపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ చోటకుంటపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన పెద్దరెడ్డెప్ప భార్య చెంచమ్మ (70) తమ ఆవు దూడలను మేపేందుకు తరచూ గ్రామ శివారు ప్రాంతాలకు వెళుతుంది. యథాప్రకారం శనివారం మేపేందుకు తోలుకెళ్లింది. నీరు తాపేందుకు స్థానికంగా ఉన్న బల్లెనిచెరువు వద్దకెళ్లి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. గ్రామస్థులు గమనించి బయటికి తీసేసరికే మృత్యువాతపడింది. ఈ మేరకు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హౌస్ ఆఫీసర్ రెడ్డెప్పనాయక్ తెలిపారు.

26 సిలిండర్లు స్వాధీనం

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో వాణిజ్య అవసరాల కోసం గృహోపకరణ సిలిండర్లను వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. శనివారం సివిల్ సప్లైస్ డీటీ వెంకటరెడ్డి, తహసీల్దార్ మహమ్మద్‌అన్సారీ తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని హోటళ్లు, టీకొట్లు, చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 దుకాణాలలో నిబంధనలను అతిక్రమించి వినియోగిస్తున్న 26 వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డీటీ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిలిండర్లు అక్రమంగా వినియోగిస్తున్న 16 మందిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కాగా గ్యాస్ సిలిండర్ల వినియోగంపై దాడులు నిర్వహిస్తారన్న సంగతి ముందస్తుగా కొందరు హోటల్ యజమానులకు తెలియడంతో వారు సిలిండర్లు దొరకకుండా జాగ్రత్తపడ్డారని, తెలియని వారు దొరికారని పట్టణంలో ప్రచారం జరిగింది. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీరాములు, మల్లికార్జున పాల్గొన్నారు.



అక్రమంగా వాడుతున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

విద్యార్థుల ఆటో బోల్తా

● 8 మందికి గాయాలు

తంబళ్లపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇళ్లకు వెళుతున్న విద్యార్థుల ఆటో బోల్తా పడటంతో 8 మంది విద్యార్థులు గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో శనివారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె, దిగువపల్లె, గుండ్లపల్లెకు చెందిన పలువురు విద్యార్థులు తంబళ్లపల్లె మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులకు పాఠశాల తెరిచే సమయానికి అనువుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ పాఠశాలకు గుండ్లపల్లె రెడ్డిశేఖర్ నాయుడుకు చెందిన ఆటోలో వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల ముగియగానే సుమారు 15 మందికి పైగా విద్యార్థులు ఆటోలో వారి ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో పరుసతోపు సమీపంలో విద్యార్థులు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యాశ్విత (13), లాస్య (12) లిఖిత్ (14), అనిల్‌కుమార్‌రెడ్డి (14), పూర్ణిమ (11), మహమ్మద్ నవీద్ (14), హర్షిత (11), ఇంటర్మీడియట్ చదువుతున్న మౌనిక (17) గాయపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు గాయపడిన విద్యార్థులను హుటాహుటిన తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లిఖిత్, మహమ్మద్ నవాద్‌కు మోకాళ్లు, కాళ్లకు ఎక్కువగా గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిందన్న విషయం తెలుసుకున్న వారి తల్లితండ్రులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని గాయపడిన బిడ్డలను చూసి రోదించారు. కాగా మద్యం తాగి ఆటో నడపటంతోనే ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎంఈవో త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బస్సు ఏర్పాటు చేయాలి

తంబళ్లపల్లె-ములకలచెరువు రహదారిలో విద్యార్థుల పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ మార్గంలో ఉన్న బస్సు ఉదయం 9 గంటలకు పైగా వస్తుందని ఈ బస్సు తంబళ్లపల్లెకు చేరుకునే సరికి పాఠశాల ప్రారంభ సమయం దాటిపోతుందన్నారు. దీంతో ప్రతిరోజూ విద్యార్థులను ఆటోలో పాఠశాలలకు పంపిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు, పరామర్శిస్తున్న ఎంఈవో, తదితరులు

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


మదనపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మదనపల్లె ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఈవోఆర్డీ అబ్దుల్‌షకూర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భోజన విరామ సమయంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై కొందరు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడిచేసినచ వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షఫ్రుద్దీన్, శ్వేత, కార్యాలయ సిబ్బంది భార్గవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కురబలకోటలో నిరసన తెలియజేస్తున్న కార్యాలయ సిబ్బంది

కురబలకోటలో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట దాడిని నిరసిస్తూ కార్యాలయ సిబ్బంది నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఎంపీడీవోపై దాడి చేసి గాయపరచడం సిగ్గు చేటని దాడి చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏవో నాగరాజు, కార్యదర్శులు నరసింహులు, శేషగిరి,రఘు, రెడ్డిశేఖర్,ఏపీఎం శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నరేంద్ర పాల్గొన్నారు.


నిమ్మనపల్లెలో నిరసన తెలుపుతున్న సిబ్బంది

నిమ్మనపల్లిలో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మండల అభివృద్ధి అధికారిపై దాడిచేసిన వైసీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని కోరారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి వారి పనులను చేసుకొన్నారని దాని కారణంగా ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పామన్నారు. దళిత ఎంపీడీవోపై దాడి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నవాజ్, రమేష్ ఆశీర్వాదం, రవి, మురళి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు

పీలేరులో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకుల దాడిని పీలేరులోని మాలమహానాడు ఐక్యవేదిక, టీడీపీ దళిత విభాగం నాయకులు ఖండించారు. పీలేరులో శనివారం జరిగిన కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు గుర్రం నారాయణ, రామాంజులు మాట్లాడుతూ దాడి చేసిన సుదర్శన్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడమే కాకుండా అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలన్నారు. పీలేరు మండల టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కప్పరం చంద్రయ్య మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైసీపీ నాయకులకు అధికారమదం ఇంకా తగ్గలేదన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు వెంకటరమణ, రమణ, లోకనాథం, చంద్రయ్య, రామకృష్ణ, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకులు మూకుమ్మడిగా దాడి చేయడం అమానుషమని పీటీఎం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. దాడిని ఖండిస్తు జిల్లాలోని అన్ని మండల ఎంపీడీవోలందరు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రాన్ని అందజేశామన్నారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు.


నిరసన తెలుపుతున్న కలికిరి ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది

కలికిరిలో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన పైశాచిక దాడిని ఖండిస్తూ కలికిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది శనివారం ఎంపీడీవో భానుమూర్తి రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యాలయం ఈ సందర్భంగా ఎంపీడీవోపై జరిపిన దాడి హేయమైన చర్యగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రియాజుద్దీన్, పరిపాలనాధికా రి సురేంద్రబాబు, ఏపీవో సుజాత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


:గుర్రంకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు

గుర్రంకొండలో:గాలివీడు ఎంపీడీవోపై దాడికి పాల్పడిన నాయకులను కఠినంగా శిక్షించాలని గుర్రంకొండ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై నాయకులు దాడులకు పాల్పడడం హేమమైన చర్య అన్నారు. ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

రామసముద్రంలో: గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి అమానుషమని దాడిని ఖండిస్తూ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ శివశంకర్ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పరిపాలన అధికారి గౌస్‌బాషా మాట్లాడుతూ జవహర్‌బాబుపై దాడి చేయడం, విధులను అడ్డుకోవడం చట్టరీత్యా నేరమని ఇందుకు బాధ్యులైన వారిసిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతో బాధ్యతతాయుత ధోరణితో పనులు చేయించుకోవాలే గాని భౌతిక దాడులు చేయడం మంచిది కాదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకర్‌రెడ్డి, ఏపీవో గౌరీశంకర్, ఎంఈవో ఆంజనేయులు, టీడీపీ నాయకులు స్థానికం చిన్నుస్వామి, రాజేష్, బోయ రమణ, హైస్కూల్ చైర్మన్ కృష్ణప్ప, మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, త్యాగ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పాడి ఆవుకు తోకను కోసిన దుండగులు

నిమ్మనపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాపం పుణ్యం ఎరుగని పాడి ఆవుపై కొందరు దుండగులు అమానుషంగా దాని తోకను కత్తిరించిన సం ఘటన శనివారం చోటు చేసుకొంది. మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి గొల్లపల్లికి చెందిన నల్లప్పగారి పెద్దవెంకటమణకు చెందిన పాడి ఆవును తన రేకులషెడ్‌లో కట్టేసి ఉండగా శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు తోకను కోసివేశారు. దీంతో యజమాని పెద్దవెంకటరమణ ఉద యం ఆవును రెడ్డివారిపల్లిలోని పశువుల ఆసుపత్రిలో చికిత్సలు చేయించి అనంతరం కత్తి రించిన తోకను ఎత్తుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి ఆవుకు 3నెలల దూడ కూడ వుందని ఆవుపై అమానుషంగా తోకను కత్తిరించిన వారిపై చ్యలు తీసుకొవాలని తెలిపాడు.

స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్జీవో హోం వద్ద యూటీఎఫ్ జెండాలను ఆవిష్కరించి యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను ప్రారంభించారు. జనవరి 5 తేదీ నుంచి 8వ తేదీవరకు నాలుగు రోజుల పాటు కాకినాడలో నిర్వహించే సభలకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కరించడంలో యూటీఎఫ్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శిజాబీర్, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కలికిరి క్రాస్ రోడ్డుకు తీరనున్న తాగునీటి సమస్య

కలికిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్‌రోడ్డు పరిసరాల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కొత్త బోరు వేసి మోటారు బిగించి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చొరవ తీసుకుని ఆదేశించడంతో స్థానిక మేజర్ పంచాయతీ అధికారులు శనివారం కొత్త బోరు తవ్వకం ప్రారంభించారు. కేవలం 130 అడుగుల లోతులోనే మూడు ఇంచీల నీరు పెల్లుబికింది. సర్పంచ్ యల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి జి.అశోక్‌లు దగ్గరుండి బోరు తవ్వకాన్ని పర్యవేక్షించారు. నీరు పుష్కలంగా పడటంతో వెంటనే కొత్త మోటారు బిగించి క్రాస్ రోడ్డు పరిసరాల్లో నీటి ఎద్దడి సమస్యను తీరుస్తామని చెప్పారు.

సంఘమిత్ర తొలగింపుపై విచారణ


వెలుగు కార్యాలయం వద్ద విచారణకు హాజరైన వీవో లీడర్లు

బి.కొత్తకోట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ అధికారులు శనివారం సంఘమిత్ర తొలగింపుపై రహస్య విచారణ చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా...పట్టణంలోని 17వ గ్రామసంఘం సంఘమిత్ర గా పనిచేస్తున్న లక్ష్మీ తొలగింపు పై గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేగింది. తనను అక్రమంగా తొలగించారంటూ ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామసమాఖ్య పరిధిలోని 31 సంఘాలకు చెందిన లీడర్లు సైతం లక్ష్మీకి మద్దతుగా స్థానికి వెలుగు కార్యాలయం ఎదుట, జ్యోతిసర్కిల్ లో ధర్నాలు చేసి నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్ వద్దకెళ్లి 31 సంఘాలు ఏకగ్రీవంగా లక్ష్మీని సంఘమిత్రగా కోరుకుంటున్నా, కొన్ని ప్రలోభాల కారణంగా సంఘాల ఆమోదం లేకుండానే ఆమెను తొలగించారని దీనిపై విచారించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ తో కలిసి బి.కొత్తకోటకు చేరుకొని వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. వివాదం నెలకొన్న 17 గ్రామసమాఖ్య పరిధిలోని 31 సంఘాలకు చెందిన ఫస్ట్‌లీడర్ల తో సమావేశమయ్యారు. స్థానిక ఏపీయంను కూడా లోనికి రానీయకుండా లీడర్ల నుంచి సంఘమిత్ర విషయంలో అభిప్రాయసేకరణ చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చామని, వీవో లీడర్ల అభిప్రాయసేకరణ చేశామని, విచారణ నివేదికను కలెక్టర్ కు అందజేస్తామన్నారు. ఈ విషయమై ఏపీయం రాజేశ్వరి మాట్లాడుతూ విచారణ అంశాలు తనకేమీ తెలియదన్నారు. సంఘమిత్ర లక్ష్మి తొలంగింపు తో తనకేమీ సంబంధం లేదని ఆమె పేర్కొన్నారు.

బ్రిటీష్ కాలం గ్రామాలు మాయం

పేర్లున్నాయి... మూడు గ్రామాలు లేవు ● 70 ఏళ్లుగా అలాగే పాలన


పెద్దగురవలూరు సదస్సులో పాల్గొన్న అధికారులు

చాపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌వారు 1905-1910 మధ్య ఏర్పాటు చేసిన గ్రామాలు మాయమ య్యాయి. పేర్లున్నా గ్రామాలు లేవు. అంతేకాదు సుమారు 70 ఏళ్లగా అలా గే పాలన సాగుతోంది. ప్రభుత్వ కార్య క్రమాల్లోనూ మూడు రెవెన్యూ గ్రామాల షెడ్యూల్ చూపుతున్నారు. లేని గ్రామాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో చూపుతుండడం వింతగా అనిపిస్తోంది. హైటెక్ యుగంలోనూ గ్రామాలు లేకుండా పరిపాలన చేయడం వింతగా అనిపిస్తోంది. రెవెన్యూ అధికారులు అనేక ఏళ్లగా ఈ గ్రామాలపై దృష్టి పెట్టలేదు. వివరాల్లోకెళితే....

మండలంలో 19 రెవెన్యూ గ్రామాలను బ్రిటీష్‌వారు ఏర్పాటు చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం భూములను రైతుల పట్టాల పేర్లతో ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ (ఫీల్డ్‌మ్యాప్ బుక్) వంటి రికార్డులను తయారు చేశారు. రెవెన్యూ గ్రామాలు వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, బూడిదపాడు, కుచ్చుపాప, పల్లవోలు, చాపాడు, చియ్యపాడు, చిన్నగురవలూరు, నెర్రవాడ, కేతవరం, మదూరు, సోమాపురం, మొరాయిపల్లె, వెంగన్నగారిపల్లె, పిచ్చపాడు, పెద్దగురవలూరు, బద్రిపల్లె, అల్లాడుపల్లె ఉన్నాయి. వీటిలో తుమ్మలపాడు, బూడిదపాడు, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాలు 1950 నుంచి మాయ మయ్యాయి. బ్రిటీష్ వారు తయారు చేసిన రికార్డుల ప్రకారం తుమ్మలపాడులో 257.54 ఎకరాలు, బూడిదపాడులో 1070.19 ఎకరాలు, పిచ్చపాడులో 996.49 ఎకరాలు భూములు ఉన్నాయి. పిచ్చపాడుకు ఉపగ్రామాలుగా జడ్డిగారుకొట్టాలు, ద్వారకానగర్ ఉన్నాయి. తుమ్మలపాడు, బూడిదపాడుకు ఉపగ్రామాలు లేవు. సుమారు 70 ఏళ్లుగా ఆ గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామాలను వదిలి వేరే గ్రామాల్లోకి వెళ్లి స్థిరపడ్డారు. తుమ్మలపాడులో సుమారు 70 కుటుంబాలవారు ఉండేవారు. ఇతర గ్రామాలతో రాకపోకలు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులంతా పక్కగ్రామాలైన అయ్యవారిపల్లె, రాజువారిపేట, సీతంపల్లె గ్రామాలకు వెళ్లిపోయారు. బూడిదపాడులో ఉన్న 150 కుటుంబాలవారు పక్క గ్రామాలైన పెద్దగురవలూరు, చిన్నగురవలూరు గ్రామాలకు వెళ్లిపోయారు. కొందరు శ్రీరాములపేట అనే కొత్త గ్రామాన్ని నిర్మించుకున్నారు. ఈ గ్రామం కుందూ నది వద్దున ఉండడంతో వరదనీరు ఆ గ్రామంలోకి వచ్చేవని గ్రామస్థులు తెలిపారు. అందువలన నష్టం జరుగుతుండడంతో ఇల్లు పడిపోతుంటాయి. పిచ్చపాడు గ్రామంలో సుమారు 40 ఇళ్లు ఉండేవి. ఆ గ్రామం వద్ద వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామంలోకి వచ్చేవని తెలిపారు. ఇళ్లలోని సామాన్లు కొట్టుకుపోయేవన్నారు. నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో గ్రామస్థులు పక్కగ్రామాల్లో మామిళ్లపల్లె, కొత్తపల్లె, సిద్దారెడ్డిపల్లె, ద్వారకానగరం, ఖాదుకూరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇలా మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ గ్రామాలు పేర్లు మాత్రమే వాడుకలో ఉన్నాభౌతికంగా ప్రజలు లేరు, గ్రామాలు లేవు. లేని గ్రామాలను రికార్డుల్లో చూపించడం సమంజసం కాదని ఆ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈనెల 24న అయ్యవారిపల్లెనూ, 27న పెద్దగురవలూరు, 19న సిద్దారెడ్డిపల్లెలోనూ రెవెన్యూ సదస్సుల సందర్భంగా అధికారులు గ్రామసభలు నిర్వహించారు. జిల్లా అధికారులు ఈ మూడు పేర్లను తొలగించి వాటిస్థానంలో ప్రస్తుతం ఉన్న పక్క గ్రామాల పేర్లతో రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయడం అవసరం ఎంతైనా ఉంది.

జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు

డాక్టర్ జహంగీర్ బాషా


డాక్టర్ జహంగీర్ బాషాను మెమోంటోతో సత్కరిస్తున్న రోబోకాన్ ప్రతినిధి

కడప, ఎర్రముక్కపల్లి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు నిర్వహి స్తున్నట్లు డాకర్ జహంగీర్ బాషా పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన రోబో కాన్ 2.0 రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటువంటి గౌరవం దొరక డం రాయలసీమలోనే చాలా అరుదని చెప్పారు. దేశం నలుమూలల నుంచి రోబోటిక్ కీళ్ల రీప్లేస్‌మెంట్ సర్జన్‌లు పాల్గొన్నారని అందులో తన అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో కీళ్ళ మార్పిడి రోబోటిక్ అసిస్టెంట్ పద్ధతిలో జరుగుతాయని వివరించారు. జేబీ హాస్పిటల్లో ఉన్న వెలిస్ రోబో చాలా అత్యాధునిక మైనదని (పిష్త్ జనరేషన్) ఇంతకు మునుపు ఇతర రోబోల్లో ఉన్న సమస్యలు ఇందులో లేవన్నారు. ప్రస్తుతం ఆపరేషన్లు అతి తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో అతి తక్కువ రక్తస్రావం ఇన్‌ఫెక్షన్ లేకుండా జరుగుతాయన్నారు. ఇప్పటికే వందకుపైగా కీళ్ళ మార్పిడిలు చేశానని వివరించారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు ఇప్పుడు రోబోటిక్ కీళ్ళ మార్పిడి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లవలసిన అవసరం లేదని జేబీ హాస్పిటల్‌లో అవకాశం ఉందని చెప్పారు.

ఘనంగా పాఠశాలల్లో సైన్స్ మేళా


పాఠశాలలో సైన్స్ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఎంఈవో

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఆదేశాల మేరకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పీటీఎం, బూర్లపల్లె ఇతర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పాఠశాల స్థాయి సైన్స్ ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రకరకాల సైన్స్ ప్రదర్శనలను ప్రదర్శించారు. సోమవారం మండల స్థాయిలో జరిగే సైన్స్ మేళా ప్రదర్శనలకు ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు ఎగ్జిబిట్స్‌ను ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి స్థానిక పీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) లో జరిగే ప్రదర్శనలో ప్రదర్శించాలని ఎంఈవో నారాయణ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

మట్కా స్థావరాలపై దాడులు

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు అరెస్టు

రూ.52,170 నగదు, పట్టీలు స్వాధీనం

ప్రొద్దుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ ఏరియాలో సాగుతున్న మట్కాదందాపై జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలతో మట్కా స్థావరాలపై టూటౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో దాడు లు చేపట్టారు. శనివారం సాయంత్రం జరిపిన వేర్వేరు దాడుల్లో దస్తగిరి పేట వాసులు పల్లె ప్రశాంత్, తలారి మైఖేల్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి మట్కా సంబంధించి రూ .25,800 నగదు స్లిప్పులు, రెండు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జిన్నా రోడ్డులోని కెనరా బ్యాంకు వద్ద మట్కా స్థావరంపై దాడులు చేసి దస్తగిరి పేటకు చెందిన షేక్ బషీర్‌అహ్మద్, దాదాగారి గౌస్‌బాషా, సాయిరాజేశ్వరీ కాలనీలో ఉంటున్న షేక్ మునీర్, మోడంపల్లెకు చెందిన పటాన్ జుబేర్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 26,370 నగదు పట్టీలు, మూడు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడు మృతి

ముద్దనూరు డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ బిడ్జి కింద నున్న రైల్వే పట్టాల వద్ద శనివారం రైలు కింద పడి మూరజోయిన మనోజ్(23) మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్ఐ సమాచారం మేరకు... ముద్దనూరు మండలం ఆరవేటిపల్లె వాసి మనోజ్ బీటెక్ చదువుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగాలేకపోవడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


హరీష్‌రెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పీటీఎం పోలీసులు అందించిన వివరాల మేరకు మండలంలోని మద్దయ్యగారిపల్లె సమీపంలో ఆగిఉన్న సిమెంట్ లారీని వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో సంపతికోట గ్రామానికి చెందిన కంబాల నారాయణస్వామి రెడ్డి కుమారుడు హరీష్‌రెడ్డి అలియాస్ బాలు (25) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కడప జిల్లా నుంచి బెంగళూరుకు వెళుతున్న సిమెంట్ మిక్సర్ లారీ సాంకేతిక కారణాలతో మదద్దయ్యగారిపల్లె సమీపంలో ఆగిపోయింది. హరీష్‌రెడ్డి) తన స్వంత పనుల నిమిత్తం ములకలచెరువుకు వెళ్లి పనులు ముగించుకుని సంపతికోటకు వచ్చే క్రమంలో ఆ వాహనాన్ని ఢీకొన్నాడు దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని హరీష్‌రెడ్డి మృతదేహన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రవికుమార్ పెర్కొన్నారు. దీంతో సంపతికోట గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు రాణెమ్మ

కలికిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలికిరి పట్టణ శివారులోని పొట్టేకులవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాణెమ్మ (60)అనే మహిళ మృతిచెందింది. కలికిరి పోలీసు ఇన్‌స్పె క్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అండేకురవపల్లె దళితవాడకు చెందిన జంగం వెంకట్రమణ భార్య రాణెమ్మ పాలు కొనుక్కు రావడానికి రోడ్డు వెంబడి వెళుతుండగా కలికిరి నుంచి గుట్టపాలెం ఆచార్లగొల్లపల్లె గ్రామానికి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాణెమ్మను వెంటనే ప్రభు త్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా మృతి చెందింది. మృతురాలు కుమారుడు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వెల్డర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):వెల్డింగ్ పనులు చేస్తూ కరెంట్ షాకుతో యువకుడికి గాయపడినట్లు తాలుకా ఎస్ఐ చంద్రమో హన్ తెలిపారు. నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన మల్లికా ర్జున(49) బసినికొండలోని ఓ వెల్డింగ్ షాపులో పనులు చేస్తుండగా కరెం ట్ షాకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలైన సంఘటన రామారావు కాలనీలో చోటు చేసుకుంది. శనివారం పట్టణంలో పని ముగించుకుని రామారావుకాలనీ, ఆటో స్టాండ్ వద్ద బైక్‌పై వస్తూ గుర్తుతెలియని వ్యక్తులు బైకును ఢీకొట్టి వెళ్లిపోయారు. గాయాలపాలైన వృద్ధుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

బీకే పల్లెలో భూ వివాదం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):బీకేపల్లెలో శనివారం భూ వివాదం చోటు చేసుకుంది. మదనపల్లె పరిధిలోని బీకేపల్లె గ్రామ సర్వేనెంబరు 521లో ఐదు ఎకరాల 56 సెంట్లు భూమి మోడీ రామన్నకు ప్రభుత్వం పట్టా ఇవ్వగా అయన తమ్ముడైన చెంగన్న రెండు ఎకరాలు, గంగమ్మకు రెండు ఎకరాల78 సెంట్లు వారసత్వంగా వచ్చింది. మదనపల్లె బైపాస్‌రోడ్డు రావడంతో కుంట 40 లక్షలపైగా పలుకుతుంది. దీంతో కొతమందికి ఈ భూమిపై కన్నుపడింది. తమ వద్ద గంగులిరెడ్డి నుంచి కృష్ణారెడ్డి కొనుగోలు చేశామంటూ కోర్టు నుంచి నోటీసులు పంపి సర్వేయచేయడానికి తమ భూమిలోకి వచ్చారని బాధితులు తెలిపారు. దీంతో సర్వే అధికారులు అక్కడికి వెళ్ల వారిని అడ్డగించడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

విద్యారంగ పరిరక్షణే ఎస్ఎఫ్ఐ ధ్యేయం

మదనపల్లె టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగం పరిరక్షణే ఎస్ఎఫ్ఐ ధ్యేయంగా పనిచేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేశ్ పేర్కొన్నారు. శనివారం మదనపల్లెలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో జిల్లా మహాసభ నిర్వహించారు. తొలుత స్థానిక జ్ఞానోదయ గ్రౌండ్ నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి జీఆర్‌టీ హైస్కూల్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన మహాసభలో వక్తలు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టేసి, పేద విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యాహక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరుబాట నిర్వహిస్తూనే ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరునెలల కాలం పాలన ముగిసినా ఇంత వరకు తల్లికి వందనం నిధులు మంజూరు చేయకపోవడం బాధకరమన్నారు. యువత ఉద్యోగాలు లేక ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి వ్యసనాలకు బాని సలవుతున్నారని వాటిపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హరినీధ్‌శర్మ, సోమశేఖర్, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, రవిప్రకాష్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు జన్మదిన శుభాకాంక్షలు



మదనపల్లె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మదనపల్లె నియోజకవర్గ పరిశీలకుడు శివరాంప్రతాప్ కు స్థానిక పార్టీ నేతలు జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు. తం బళ్లపల్లె నియోజకవర్గ పరిశీలకుడు కోపూరి మల్లికార్జుననా యుడు, స్థానిక మైనార్టీనేతలు పఠాన్ ఖాదర్‌ఖాన్, ఎస్ఏ మస్తాన్, టీడీపీ సీనియర్ నేత బంగా రు రామకృష్ణలు మదనపల్లెలో శనివారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. ఇందులోభాగంగా శివరాంప్రతాప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కట్టా దొరస్వామినాయుడు, మార్పూరి శశిధర్‌రావు, ఆర్కే రామకృష్ణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా మా కక్షిదారులైన అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలం మరియు టౌన్, సంత బజారు, డో.నెం. 6-77లో కాపురముండు 1) సింగిరిశెట్టి మధుసూదన, S/o ఎస్. ఆంజనేయులు, సదరు సంత బజారు డో.నెం. 6-78లో కాపురం వుండు 2) సింగిరిశెట్టి రఘురామయ్య, S/o ఎస్.ఆంజనేయులు, సదరు సంత బజారులో డో.నెం. 6-67లో కాపురం వుండు 3) సింగిరిశెట్టి నాగరాజు, S/o ఎస్.ఆంజనేయులు తరపున యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారులు మరియు సదరు వైశ్యా బజారులో డో.నె. 6-66లో కాపురం వుండు సింగిరిశెట్టి వెంకటసుబ్బయ్య శెట్టి, S/o ఆంజనేయులు, ఇంకా కొంతమంది కలిసి తేది 27-05-2019న అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం, టౌన్ & పోస్ట్ క్రిష్ణాపురం, డో.నెం. 38/113-3-31-1-ఎ నందు కాపురం వుండు సింగిరిశెట్టి రాజశేఖర్ బాబు, తండ్రి ఎస్.ఆంజనేయులు మరియు అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలం, పోస్టు & గ్రామం, సంత బజారులో డో.నం. 6-67లో కాపురం వుండి సింగిరిశెట్టి త్రివిక్రమ్, తండ్రి ఎస్.నాగరాజు గార్లకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు వ్రాయించి ఇచ్చివుండిరి. కొన్ని మనస్పర్ధల కారణంగా ఈ GPA దస్తావేజును రద్దుపరచాలనే ప్రయత్నం చేసే క్రమంలోనే ఎస్.ఆంజనేయులు గారి కుమారుడు మరియు ఒకానొక GPA దస్తావేజు Executant అయిన సింగిరిశెట్టి వెంకట సుబ్బయ్య శెట్టి గారు తేది : 10-05-2021న అనారోగ్య కారణంగా మరణించినారు. అతని మరణంతో ఈ GPA దస్తావేజు రద్దు అయిపోయింది. కానీ, పై తెలిపిన GPA Holders అయిన ఎస్.రాజశేఖర్ మాబు మరియు ఎస్ త్రివిక్రమ్ గార్లపై విషయాలను మరుగుపరచి, దురుద్దేశంతో లాభాన్ని పొందాలనే తలంపుతో, ఒరిజినల్ హక్కుదారులకు నష్టం కలిగించే విధంగా ఇప్పటికీ వారు GPA Holders అని చెప్పుకుంటూ.. ఈ ఆస్తిపై విక్రయాలు జరపాలని ప్రయత్నిస్తున్నారు. చట్టవిరుద్ధమైన ఈ విక్రయాలు ఎంతమాత్రం చెల్లవని యావన్మందికీ తెలియజేస్తున్నాము. ఈ ప్రకటనను లెక్క చేయక విక్రయాలు జరిపితే మేము వారిపై తీసుకొనబోవు అన్ని రకాల చట్టపరమైన చర్యలకు వారు బాధ్యులుగా వుందురని, మరియు అన్ని రకాల సివిల్ & క్రిమినల్ దావా ఖర్చులు వారే భరించాల్సివుంటుందని బహిరంగంగా యావన్మందికి తెలియజేస్తున్నాము.

షెడ్యూలు : అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట సబ్ - డిస్ట్రిక్ట్, బి.కొత్తకోట మండలం మరియు గ్రామం జమీను వివరాలు 1) S.No. 29, Extent Ac 0.31 1/4 Cents, 2) S.No. 30, Extent Ac 1-48 1/2 Cents , 3) S.No. 31/2, Extent Ac 0.12 1/4 Cents, 4) S.No. 36, Extent Ac 1-22 1/2 Cents, 5) S.No. 37, Extent Ac 1-59 Cents, 6) S.No. 38, Extent Ac 2-87 Cents, 7) S.No. 155, Extent Ac 0.27 Cents, 8) S.No. 157, Extent Ac 0.48 Cents, 9) S.No. 311, Extent Ac 0.94 1/2 Cents, 10) S.No. 896/1, Extent Ac 0.05 1/2 Cents, 11) S.No. 875/1, Extent Ac 0.11 1/2 Cents, 12) S.No. 985/25, Extent Ac 0.55 Cents, 13) S.No. 1083/1, Extent Ac 0.06 3/4 Cents, 14) S.No. 1869/2, Extent Ac 0.90 Cents, 15) S.No. 1087/3, Extent Ac 0.14 1/2 Cents, 16) S.No. 1087/1, Extent Ac 0.06 Cents 17) S.No. 1088/1, Extent Ac 0.36 182 Cents, 18) S.No. 948, Extent Ac 0.27 Cents, 19) S.No. 951, Extent Ac 0.24 Cents, 20) S.No. 965-1, Extent Ac 0.64 Cents, 21) S.No. 966, Extent Ac 0.08 1/2 Cents, 22) S.No. 972, Extent Ac 0.25 1/2 Cents.

K.SOMASEKHAR, B.A., B.L., Advocate. Madanapalle. Ph : 94911 63027

పట్టణంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



రోడ్డు పనులకు భూమిపూజ దృశ్యం

మదనపల్లె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా భూమి పూజ చేశారు. మున్సిపాలి టీలోని వివిధ రకాల నిధులు రూ.96లక్షలతో 2, 3, 8, 10, 32, 34 వార్డుల్లో చైర్‌పర్సన్‌తో కలసి ఎమ్మెల్యే శనివారం సిమెంటు రోడ్లు, కాలువలు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధికి ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ది చేసి, ఆదర్శంగా తీర్చుదిద్దుతామన్నారు. కార్యక్రమాల్లో కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు వాయిస్ కరీముల్లా, శివయ్య, ఎం.నాగార్జున బాబు, నాయకులు బి.పురుషోత్తం, శ్రీనివాసులునాయుడు, రఘుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం గాలివీడుకు వచ్చిన డిప్యూటీ సీఎంను కలసిన ఎమ్మెల్యే శాలు వకప్పి, సన్మానించారు. నియోజక వర్గంలో పంచాయతీ రహదారుల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం

కలకడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన కలకడలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభమైనట్లు ఆ సంస్థ వాల్మీకీపురం ఎస్‌డీఈ జి.వెంకటాచలపతి తెలిపారు. ఇది వరకు పట్టణంలో 2జీ, 3జీ సేవలున్నట్లు తెలిపారు. నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా 4జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. దీంతో విని యోగ దారులు వేగవంతమైన ఇంటర్‌నెట్ బ్రౌజింగ్ సేవలు అందుతాయన్నారు.

జగన్ అవినీతే విద్యుత్‌కు శాపం

● వైసీపీ కపట నాటకాలు ఎవరూ నమ్మరు ● బాబు పాలనలో విద్యుత్ చార్జీలు పెరగవు ● టీడీపీ నేతలు



ములకలచెరువు సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు



పీలేరులో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

ములకలచెరువు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జగన్ చేసిన అవినీతి వల్లే విద్యుత్ రంగం అస్తవ్యస్తమైందని టీడీ పీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి ఎర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు జగన్ విద్యుత్ డ్రామాలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ ఇష్టం వచ్చినట్లు విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు ధర్నాలు చేసి ప్రజలను మోసం చేస్తు న్నాడన్నారు. గత ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు ధర్నాల పేరుతో వైసీపీ ఆడుతున్న కపట నాటకాలు ఎవరూ నమ్మరన్నారు. గాలివీడు ఎంపీడీవోపై వైసీపీ నాయకులు చేసిన దాడిని ఖండించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు భజంత్రి రామాంజులు, పాల రాము, సుబ్బినాయుడు, నారాయణ, రెడ్డెప్ప, భాస్కర్ రెడ్డి, బషీర్, రమణప్ప, ఫక్రుద్దీన్, మురళి, రవీంద్ర, గంగాదేవి పాల్గొన్నారు.

ఉనికి కోసమే వైసీపీ ఆందోళనలు

పీలేరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ, కేవలం తన ఉనికి కోసమే ఆందోళనలు చేస్తోందని పీలేరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పీలేరులో శనివారం విలేఖరుల సమా వేశంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు మాట్లాడుతూ సాధారణ ఇంటికి 2019లో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.600ల విద్యుత్ బిల్లులు వచ్చేవని, 2024లో జగన్ ప్రభుత్వం దిగే సమయానికి అది మూడింతలు పెరిగి రూ.1800లు వస్తోందన్నారు. ఐదేళ్ల పాలనలో ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌దేనన్నారు. సంక్షేమ పథకాల ముసుగులో చేసిన అవినీతి ఎక్కడ బయటకు వస్తుందోనన్న భయంతో విద్యుత్ చార్జీలు పెరిగాయంటూ అబద్ధపు ఆరోపణలు చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారన్నారు. మాజీ జడ్పీటీసీ మల్లెల రెడ్డిబాషా మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఏనాడైనా ఆందోళనలు చేసుకోనిచ్చారా అని ప్రశ్నించారు. పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్‌రెడ్డి. నాయకులు పురంరామ్మూర్తి, అమరనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, కోటపల్లె శ్రీనాథరెడ్డి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, ఆర్‌బీఐ రమణారెడ్డి, కంచి సూరి, హనీ ఫ్, రెడ్డిముని, రమాదేవి, షౌకత్ అలీ, చాన్‌బాషా, కోడి రామకృష్ణారెడ్డి, లక్ష్మీకర, నగేశ్, వినోద్, నల్లారి రియాజ్, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ నిర్మాణానికి సహకరించండి

మదనపల్లె టౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రైల్‌ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)కి స్థలం ఇచ్చి నిర్మాణాలకు సహకరించాలని ఎన్‌హెచ్ ఏఈ మంజుల, తహసీల్దార్ ఖాజాబీ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని సీటీఎం వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ నిర్వాసితులతో అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమ ఇంటి స్థలాలు, నిర్మాణాలకు నష్టపరిహారం ఇవ్వకుండా స్థలాలను అప్పగించే ప్రసక్తే లేదన్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ బాధితులకు నష్టపరిహార విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. అక్కడి నుంచి అర్బిట్రేషన్ వస్తూనే ఎన్‌హెచ్ అధికారులు నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో 11 మంది నిర్వాసితులు, సీటీఎం సర్పంచ్ ఆనంద పార్థసా రథి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాటు బాంబు పేలి కుక్క మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి):నాటు బాంబు పేలి కుక్క మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లె మండలం, పోతబోలు గ్రామంలో కలకలం రేపింది. మండలంలోని పాలెంకొండకు చెందిన శ్రీరాములు మేకలను మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజులాగా తన మేకల వెంట పెంపుడు కుక్కను పొలాలపైకి తీసుకెళ్లాడు. పోతబోలు సమీపంలో చెరువు మొరవలో అడివి పందులను చంపడం కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన నాటుబాంబును కుక్క కొరకడంతో అక్కడికి అక్కడే మృతి చెందింది. ఈ విషయంగా తాలుకా పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



గుర్రంకొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తరిగొండ టీడీపీ నాయకులు తమ పేదలు, అనాథులకు శనివారం దుప్పట్లు, అన్నదానం చేశారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి కొత్త ఏడాది కలసివచ్చి మంత్రి పదవి రావాలంటూ మురాషావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గాలో చాదర్‌ను సమర్పించి పూజలను చేశారు. అలాగే నల్లారి అమరనాథ్‌రెడ్డి సేవా సంఘం ద్వారా పేదలు, అనాథులకు దుప్పట్లు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నౌషాద్‌అలీ, చంద్రబాబు, రెడ్డెప్ప, హేస్సాన్, సమద్, ఖాజా, సైసావలి, ఓబులేసు, ఖాదర్‌వలి, మహ్మద్‌వలి, వేణుగోపాల్‌రెడ్డి, జోహర్, రాజన్న, ఉమాశంకర్, ప్రదీప్‌చంద్, గంగాధర్, శ్రీరాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం టైరు పేలి డ్రైవర్ కంటికి గాయం

పెద్దమండ్యం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) 108 వాహనం టైరు పేలి డ్రైవర్ కంటికి గాయాలైన సంఘటన శనివారం వెలుగు చూసింది. బాధితుడి బంధువుల వివరాల మేరకు పెద్దమండ్యం మండలం కలిచెర్ల కు చెందిన రామాంజులు (35) 108 వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఇటీవలె కుప్పం నుంచి పెద్దమండ్యం కు బదిలీపై వచ్చాడు. గురువారం రాత్రి 108 వాహనంలో పెద్దమండ్యం నుంచి మదనపల్లికు కు వెలుతున్న సమయంలో వాహనం టైరు నుంచి శబ్దాలు రావడంతో మార్గం మధ్యలో కలిచెర్ల వద్ద ఆపేశాడు. శబ్దం వస్తున్న చక్రం దగ్గరుకు వెళ్లి పరిశీలిస్తుడంగా ఒక్కసారిగా టైరు పేలింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ కంటికి తీవ్రంగా గాయమైనట్లు తెలిపారు. ప్రాణపాయ స్థితి నుంచి బయటపడిన ఆయనకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ జరిగిందని 3 నెలలకు వరకు కంటి చూపు వస్తుందో లేదో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దాతలు, అధికారుల సహకారంలో 108 వాహనం డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికప్రజలు కోరుతున్నారు.